Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 26.09.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 17 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

# ఆపరేషన్ కరప్షన్

## ★ మంత్రులపై మోడీ నిఘా

## ★ అవినీతి పనులకు ఆదిలోనే కళ్లెం



భారత దేశానికి ఇప్పటివరకు 14మంది ప్రధానమంత్రులు పని చేశారు. నరేంద్ర మోడీ 15వ ప్రధానమంత్రి. అయితే మిగిలిన 14మందికి నరేంద్రమోడీకి మధ్య చాలా వ్యత్యాసముంది. మిగిలిన ప్రధానులకు కుటుంబపరంగానో, రాజకీయ పరంగానో పునాదులున్నాయి. వాజ్‌పేయి వంటి నాయకులకు అపార అనుభవం, మేధస్సు వంటివి ప్రామాణికమయ్యాయి. కాని మోడీకి ఎటువంటి రాజకీయ నేపథ్యం లేదు. గొప్ప కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి కాదు. ఒక పేద కుటుంబం నుండి వచ్చాడు. కష్టపడుతూ ఎదిగారు. ఛాయ్ వాలా దశ నుండి మొదలుపెట్టి ఈరోజు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత దేశానికి ప్రధానిగా ఉన్నాడు.

ఒక నిరుపేద కుటుంబీకుడు ఈ స్థాయికి చేరడమనేది ఆషామాషీ విషయం కాదు. చెప్పులు కుట్టుకునే వృత్తి నుండి అమెరికా అధ్యక్షుడి స్థాయికి ఎదిగిన అబ్రహం లింకన్‌తో మోడీని పోల్చవచ్చు.

ఎంతో కసిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి ప్రధానిపీఠంపై కూర్చున్న మోడీ ఆ పదవిని ఎంజాయ్ చేస్తాడనుకుంటే పొరపాటే! ఆయన పవర్‌ను ఎంజాయ్ చేయడం లేదు. ప్రధాని పదవికి వున్న పవర్ ద్వారా ఏమేం చేయవచ్చో చూపిస్తున్నారు. దేశానికి ఆరున్నర దశాబ్దాలుగా పట్టిన నిర్లక్ష్యం తుప్పును, అవినీతి దరిద్రాన్ని వదిలించేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు.

ముఖ్యంగా అవినీతి రహిత భారత్‌పై ఆయన దృష్టి పెట్టారు. దేశంలో ఆరున్నర దశాబ్దాల కాలంగా అవినీతి వేళ్లూనుకునిపోయింది. దీనిని ఒక్కరోజులోనో, ఒక్క (మిగతా 10వ పేజీలో)










## మార్స్ కౌగిట్లోకి 'మామ్'

అంతరిక్షంలో భారత్ మరో అద్భుతాన్నే సృష్టించింది. ఇస్రో శాస్త్రవేత్తలు గత ఏడాది అంతరిక్షంలోకి పంపిన మార్స్ ఆర్బిటర్ మిషన్ (మామ్) అరుణగ్రహ కక్ష్యలోకి విజయవంతంగా అడుగుపెట్టింది. అంతరిక్ష రంగంలో భారత్ కీర్తి పతాకను రెపరెపలాడించింది. అంతరిక్షంలో 324రోజుల పాటు ఎక్కడా ఎలాంటి తొట్రుపాట్లు లేకుండా, అక్షరాలా అరవైఆరు కోట్లా ఆరు లక్షలమైళ్ళు సుదీర్ఘ ప్రయాణం చేసిన మామ్ ఉపగ్రహం ఈ నెల24వ తేదీన అంగారక కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశించడంతో ఇస్రో శాస్త్రవేత్తలు చారిత్రాత్మకమైన విజయాన్ని సాధించినట్లయింది. ఈ అఖండ విజయంతో అంతరిక్షంలో భారత్ మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. ఇది భారతీయులందరికీ గర్వకారణమైన విజయం.

(మిగతా 10వ పేజీలో)




## నెల్లూరుకు 'పవర్' లేదు

తల్లిదండ్రులకు నలుగురు పిల్లలున్నారనుకోండి. వారిలో చిన్నపిల్లోడిపైనో లేక పెద్దపిల్లోడిపైనో కొంచెం ఎక్కువ ప్రేమ ఉండొచ్చు. అంతమాత్రాన మిగిలిన ముగ్గురి మీద ప్రేమే ఉంటుంది గాని ద్వేషముండదు. కాకపోతే ప్రేమను చూపే విషయంలో కొంత తేడారావచ్చు. అలాగే ఒక రాష్ట్ర ముఖ్యమంత్రికి రాష్ట్రంలోని ప్రతి జిల్లా బిడ్డలాంటిదే! కాకపోతే తన సొంత జిల్లా మీద కాస్తా ఎక్కువ ప్రేమ ఉంటుంది. అంతమాత్రాన మిగతా జిల్లాల మీద విద్వేషం ఉండదు.

భారతదేశ రాజకీయ చరిత్రలో ఇంతవరకు ప్రధానులు, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు తమ సొంత జిల్లాల మీద, సొంత నియోజకవర్గాల మీద అభివృద్ధి విషయంలో అభిమానం చూపించడం చూసాం, అంతేగాని ఒక ప్రాంతం మీద కక్ష కట్టినట్లు వ్యవహరించడం (మిగతా 10వ పేజీలో)

# మెరుగైన సేవలందించడమే లక్ష్యం

## చిత్తూరు ఆర్డీఓ కోదండరామిరెడ్డి

అధికారులు ఎంతో బాధ్యతగా వుండి, ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా వుండాలని, తద్వారా అధికారులు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆర్డీఓ కోదండరామిరెడ్డి అన్నారు. ఆత్మకూరు ఆర్డీఓగా వుంటూ, ఇటీవల చిత్తూరు ఆర్డీఓగా బదిలీ అయిన సందర్భంగా, ఆత్మకూరులో ఈ నెల 20న ఆయనకు ఘనసన్మానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజలకోసం ప్రవేశపెట్టిన పథకాలు సక్రమంగా అమలయ్యేందుకు అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు. ఆత్మకూరులో తాను ఏడాదిపాటు పనిచేశానని, ఇప్పుడు సొంతజిల్లా అయిన చిత్తూరుకు ఆర్డీఓగా బదిలీ కావడం తనకు సంతోషంగా వుందని అన్నారు. ఇక్కడి ప్రజలు, అధికారులు, నాయకులు అందరూ విధి నిర్వహణలో తనకెంతో సహకారం అందించారని ఆయన అన్నారు. ప్రస్తుత ఆర్డీఓ ఎం.వి రమణ, ఎ.ఓ జాన్‌కుమార్‌తో పాటు, అనేకమంది అధికారులు, స్థానిక నాయకులు పాల్గొని కోదండరామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఖాదర్‌వలీ, డాక్టర్ మాల్యాద్రి, ఎంఇఓ జయకుమార్, తహశీల్దార్లు బికె వెంకటేశ్వర్లు, సోమ్లానాయక్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఆర్. వనమ్మ, వైస్ ఛైర్మెన్ షేక్ సందాని, టిడిపి నాయకులు చంద్ర వెంకటసుబ్బయ్య, సిపిఎం నాయకులు గంటా లక్ష్మీపతి, వైఎస్సార్‌సీపి నాయకులు సూరా భాస్కరరెడ్డి, మండలపరిషత్ అధ్యక్షురాలు సుష్మ, మహిళాకాంగ్రెస్ నాయకురాలు పులిమ శైలజారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, పాత్రికేయులు ఎస్. వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొని ఆర్డీఓ సేవలను ప్రస్తుతించారు.

# చెన్నైలో ఎర్రచందనం అంతర్జాతీయ స్మగ్లర్ అరెస్ట్


దాదాపు పదేళ్ళపాటు విదేశాలకు ఎర్రచందనాన్ని అక్రమ రవాణా చేస్తూ పట్టుబడి కోర్టుకు హాజరు కాకుండా తిరుగుతూ తన అక్రమాలను కొనసాగిస్తున్న అహ్మద్ మోసాసాహెబ్‌ను సోమవారం చెన్నైలో అటవీశాఖ సిబ్బంది అదుపులోకి తీసుకుంది. అతని నుంచి మరిన్ని వివరాలను సేకరించేందుకు నెల్లూరు అటవీ అధికారులు అటవీశాఖ కార్యాలయంలో నిర్భంధించి విచారించారు. తిరుపతిలో 2003లో అరెస్టయిన స్మగ్లర్ మణివర్మ ఇచ్చిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్న అహ్మద్ మోసా సాహెబ్‌పై అప్పటి డిఎఫ్ఓ వెంకయ్య కేసులు నమోదు చేశారు. ఈ కేసు నెల్లూరుజిల్లా గూడూరు కోర్టులో విచారణలో వుంది. నెల్లూరుజిల్లాలోని వెంకటగిరి రేంజ్ సబ్ డిఎఫ్ఓ రవీంద్రనాథ్‌రెడ్డి చెన్నైలో నిఘావేసి సోమవారం అతడ్ని అదుపులోకి తీసుకున్నారు.



**నెల్లూరు అటవీ అధికారుల నిర్భంధంలో నిందితుడు**

### పోలీస్ అధికారిగా పనిచేస్తూ అక్రమాలకు

అహ్మద్ మోసా సాహెబ్ తమిళనాడులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ డిస్మిస్ అయ్యాడు. 2003కు ముందు వేలటన్నుల ఎర్రచందనం అక్రమరవాణా చేసిన మోసాకు చిత్తూరుజిల్లాకు చెందిన పలువురు స్మగ్లర్లు సహకరించినట్లు అటవీ శాఖాధికారులు తెలిపారు. తిరుపతికి చెందిన మణివర్మను అరెస్ట్ చేసి విచారించడంతో మోసా పేరు వెలుగులోకి వచ్చింది. దీంతో అప్పటికే చెన్నై పోర్టు నుంచి 640 నాటికల్ మైళ్ళ దూరం వెళ్ళిన నౌకను వెనక్కు పిలిపించారు. అందులో ఎర్రచందనం ఉన్న కంటైనర్లను స్వాధీనం చేసుకుని మోసాపై ఎనిమిది కేసులు నమోదు చేశారు. అప్పట్లోనే చెన్నైలోని మాధవరంలో ఉన్న ఒక గోడౌన్ నుంచి భారీస్థాయిలో ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో మోసాతో సంబంధాలున్నట్లు ఆరోపణలు రావడంతో చెన్నై కస్టమ్స్ అధికారి రాజన్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాల నుంచి తరలించే ఎర్రచందనం దుంగలను మోసా, చైనా, మలేసియా, సింగపూర్, జపాన్ వంటి దేశాలకు ఎగుమతి చేసేవాడు. కంటైనర్ సీలు తీయకుండా అందులోకి ఎర్రచందనం దుంగలను ఎక్కించేవాడని తెలిసింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే దుస్తులు, బొమ్మలు, రొయ్యలు తదితర వస్తువులున్న కంటైనర్లకు ఎక్సైజ్ అధికారులు సీలు వేసిన తర్వాత రాత్రి సమయాల్లో ఈ మూడు జిల్లాల్లోని చెరుకుతోటల్లో నిలుపుతారు. ఆ తర్వాత కంటైనర్ తలుపుల కిటికీలను తొలగించేవారని తెలిసింది. ఆ విధంగా తలుపులను పూర్తిగా తీసి, ఎరచ్రందనం దుంగలను కంటైనర్‌లలో చొప్పించేవాడని సమాచారం. మళ్ళీ మామూలుగా తలుపులు వేసి కీలును పెడతాడు. దీంతో తలుపునకు ఎక్సైజ్ అధికారులు వేసిన సీల్ అలాగే ఉంటుంది. అధికారులు సీలు వేసిన కంటైనర్ కావడంతో చెన్నై పోర్టులో అనుమానించేవారు కాదని సమాచారం. ఈ విధంగా మోసా భారీగా ఎర్రచందనాన్ని తరలించేవాడని తెలిసింది. మోసాను మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.




### కెఆర్‌ఆర్‌సీ తహశీల్దార్‌గా రామకృష్ణ

ప్రకాశం జిల్లా మినరల్ వాటర్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఎం.రామకృష్ణను కోనేరు రంగరావు సిఫార్సులు అమలు కమిటీ(కెఆర్‌ఆర్‌సీ) తహశీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసారు.

### ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ వితరణ

నెల్లూరుజిల్లా కొడవలూరు మండలం చంద్రశేఖరపురం గ్రామ గిరిజన బాలికల ప్రభుత్వ గురుకుల హైస్కూలు విద్యార్థులకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ డా॥ ఏనుగుల చైతన్య మురళీ తన స్వంత నిధులతో విద్యార్థులకు భోజనం ప్లేట్లు, గ్లాసులు, మిఠాయిలు పంచిపెట్టి తన దాన వితరణ చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వై.వెంకటేశ్వర్లు, తిరువళ్ళూరు, వెంకటకృష్ణయ్య, నాశిని భాస్కర్‌గౌడ్, ముక్కు రాధాకృష్ణగౌడ్, షేక్‌మాబు తదితరులు పాల్గొన్నారు.



- నూరేళ్ళ నాటకానికి.. నేటికీ ఘనమైన ఆదరణ
- 8గంటలపాటు పూర్తి స్థాయి నాటకం ప్రదర్శన
- ప్రేక్షకజనంతో కస్తూర్బా కళాక్షేత్రం కిటకిట
- ఆసాంతం తిలకించిన జిల్లా కలెక్టర్

# అబ్బురం... అద్భుతం... 'కన్యాశుల్కం'

*క్రిక్కిరిసిన ప్రేక్షక జనసందోహం మధ్య, ఉత్తేజకరమైన సన్నివేశాలతో.. సందేశాత్మకమైన సంభాషణలతో.. అత్యద్భుతమైన నటీనటుల నటనావైభవంతో ఆనందతరంగితులైన జనం కరతాళధ్వనుల మధ్య.. నెల్లూరులో 'కన్యాశుల్కం' నాటకం పూర్తి స్థాయిలో విజయవంతమైంది. ఈ నాటకం నెల్లూరులో జయప్రదమవుతుందో లేదోననే నిర్వాహకుల తటపటాయింపులన్నిటినీ పటాపంచలు చేస్తూ, నెల్లూరీయులు ఈ నాటకాన్ని విశేషంగా ఆదరించి తమ కళాభిమానాన్ని చాటుకున్నారు.*


నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఈ నెల 21న ప్రదర్శితమైన గురజాడవారి 'కన్యాశుల్కం' నాటకానికి పెద్దఎత్తున ప్రేక్షకజనం తరలిరావడంతో..మంచి నాటకానికి ప్రజల ఆదరణ ఎల్లప్పుడూ వుంటుందనే పరమసత్యాన్ని నెల్లూరీయులు మరోసారి నిరూపించినట్లయింది. ఎంతో మహత్తరమూ.. మహోజ్జ్వలమైన ఈ నాటకాన్ని దాదాపు నూరేళ్ల క్రితం మహాకవి గురజాడ రచించారు. సమాజచైతన్యమే పరమావధిగా, ఎంతో సందేశాత్మకంగా రచించిన ఈ నాటకం నాటి



సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేసింది. అప్పట్లో ఆంధ్రరాష్ట్రాన్ని ఉర్రూతలూగించిన నాటకం ఇది. ఇప్పటికీ ప్రజాదరణ చెక్కుచెదరలేదు. నాటక రంగ చరిత్రలో తమకంటూ ఒక స్థానాన్ని సాధించుకుని ప్రజల మదిలో నిలచిపోయిన పాత్రలు.. గిరీశం, రామప్పంతులు, లుబ్ధావధానులు, మధురవాణి వంటి విలక్షణమైన పాత్రలతో, అత్యద్భుతమైన సంభాషణలతో.. పాత్రోచితమైన హావభావ విన్యాసాలతో సకల ప్రేక్షకజనరంజకంగా సాగే ఈ నాటకం నాటితరాన్నే కాదు, నేటితరాన్ని కూడా ఎంతో ఆకట్టుకోవడం విశేషం. అది నూరేళ్ళ నాటక మైనా నేటికీ అశేష ప్రజల విశేష ఆదరణ పొందుతూనే వుండడం ఈ నాటకం విశిష్టత.. మహాకవి గురజాడవారి రచనా వైభవాన్ని, వైశిష్ట్యాన్ని మన కళ్ళముందు వుంచే మహత్తర, బృహత్తర నాటకం ఇది.

నెల్లూరులో ఈ నాటకానికి వూహించిన దానికంటే పెద్దసంఖ్యలో ప్రేక్షకజనం విచ్చేయడంతో నిర్వాహకులెంతో సంబరపడిపోయారు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10గంటల వరకు, 8గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ నాటకాన్ని చూసేందుకు కళాకారులూ, కళాభి మానులు, ప్రజలూ వెల్లువగా తరలిరావడంతో కస్తూర్బా కళాక్షేత్రం కిటకిటలాడిపోయింది. కళాక్షేత్రం లోపలా, బయటా ఎటుచూసినా ప్రేక్షకజనమే కనిపించారు. కుర్చీలన్నీ నిండిపోవడంతో, చివరికి కళాక్షేత్రం లోపలిభాగంలోని మెట్లమీద కూడా కూర్చుని జనం ఈ నాటకాన్ని వీక్షించాల్సివచ్చింది. కళాక్షేత్రం బయట ప్రాంగణంలో ఏర్పాటుచేసిన టివి స్క్రీన్ వద్ద కూడా ఖాళీ కనిపించలేదు. గంటలు గడుస్తూనే వున్నా ప్రేక్షకులు ఏమాత్రం విసుగు చెందకుండా చివరిదాకా వుండి ఆనందంతో ఈ నాటకాన్ని తిలకించి పులకించిపోయారు. మహోన్నత సంఘసంస్కర్త, మహాకవి గురజాడవారు రచించిన సుప్రసిద్ధమైన కన్యాశుల్కం నాటకాన్ని నేటితరంలో మనమూ చూడగలిగామన్న ఆనందం ప్రతి ఒక్కరిలో కనిపించింది. ఈ పుణ్యమంతా ఒకరకంగా నాటక కమిటీ వారిదనే చెప్పాలి. నాటక నిర్వహణ ఎంతో కష్టమైన నేటి రోజుల్లో, నెల్లూరోళ్ళకి ఎలాగైనాసరే ఈ నాటకాన్ని చూపించాలనే తపనతో ఎమ్మెల్సీ వితపు బాలసుబ్రహ్మణ్యం, వేమిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కాళిదాసు పురుషోత్తం, చలంచర్ల భాస్కరరెడ్డి, పిఎస్ఆర్ కోటిరెడ్డి తదితరులంతా గట్టిగా అనుకుని ఈ నాటకాన్ని ఇక్కడికి రప్పించి ప్రదర్శింపజేయడం అభినందనీయం. విజయనగరానికి చెందిన నవయువ ఆర్ట్స్ అసోసియేషన్‌వారు ఈ నాటకాన్ని ఇక్కడ జనరంజకంగా ప్రదర్శించి అందరి ప్రశంసలూ అందుకున్నారు. ఈ నాటకంలో ప్రధానంగా రామప్పంతులు పాత్రలో పిఆర్‌జె పంతులు, గిరీశం పాత్రలో అనిల్‌కుమార్ చెలికిచెర్ల, మధురవాణిగా శ్రీమతి పి.మణిబాల అత్యద్భుతంగా నటించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. అదేవిధంగా, అగ్నిహోత్రావధానులుగా వివిఎస్ చలం, లుబ్ధావధానులుగా విఏ నాయుడు తదితరులు పాత్రోచితంగా నటించి నాటకాన్ని బాగా రక్తికట్టించారు. మహాకవి గురజాడవారి ఈ స్ఫూర్తి మంతమైన నాటకాన్ని ఇక్కడ ప్రదర్శించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ రూ.50వేల విరాళం అందించారు. అలాగే, రైస్ మిల్లర్స్‌వారు కూడా ఈ నాటక ప్రదర్శనకు సహకరించి తమ వదాన్యత చాటుకున్నారని, ఇలా మరికొంతమంది దాతృత్వంతో, సహకారంతో ఈ నాటకం విజయవంతంగా సాగిందని నాటక కమిటీ అధ్యక్షులు నిరంజన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన నాటక కమిటీ తరఫున ప్రేక్షక జనులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ ఈ నాటకాన్ని ఆసాంతం వీక్షించారు. చివరగా, జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎమ్మెల్సీ వితపు బాల సుబ్రహ్మణ్యం కన్యాశుల్కం నటీనటులకు అభినందనలు తెలియజేసి వారికి జ్ఞాపికను బహుకరించారు. ఏదేమైనా, మహాకవి గురజాడ రచించిన సుప్రసిద్ధ మైన కన్యాశుల్కం నాటకాన్ని నెల్లూరులో ప్రదర్శింపజేసి, నేటితరం వారికి కూడా ఈ నాటకాన్ని చూసే భాగ్యం కల్పించిన కన్యాశుల్కం నాటక కమిటీవారు ధన్యులు. వారితోపాటు, నటీనటులూ, నాటకనిర్వహణకు సహకరించిన వదాన్యులూ, అన్నిటికంటే ముఖ్యంగా ఆద్యంతం ఈ నాటకాన్ని తిలకించి విజయవంతం చేసిన కళాభిమానులూ.. ప్రజలూ.. అందరూ ధన్యులే!..

## 'కన్యాశుల్కం' నాటకంతో 'లాయర్' వ్యవస్థాపకుని అనుబంధం



ఆంధ్రా యూనివర్శిటీ తరఫున ప్రదర్శించిన కన్యాశుల్కం నాటకంలో గిరీశం పాత్రధారి తుంగా రాజగోపాలరెడ్డి (వృత్తంలో), పక్కన ఆ నాటకంలోని ఇతర నటీనటులు

కన్యాశుల్కం నాటకంతో 'లాయర్' వ్యవస్థాపకులు, స్వర్గీయ తుంగా రాజగోపాల్‌రెడ్డి గారికి ఎంతో అనుబంధం వుంది. తొలినుంచి ఆయనకు నాటకాలంటే మహాఇష్టం. అందులోనూ కన్యాశుల్కం నాటకంలో ఆయన 'గిరీశం'పాత్రను అత్యద్భుతంగా పోషించి, ఉత్తమ బహుమతులు అందుకున్నారు కూడా. ఆంధ్రయూనివర్శిటీలో బి.కాం చదువుకునే రోజుల్లో యూనివర్శిటీ తరఫున నాటకోత్సవాల్లో పాల్గొనేవారు. అప్పట్లో కళాతపస్వి కె.వి గోపాలస్వామి పర్యవేక్షణలో కన్యాశుల్కం నాటకాన్ని ప్రదర్శించారు. కన్యాశుల్కం ఉత్తమ ప్రదర్శనగా బహుమతులందుకుంది. ఈ నాటకంలో గిరీశం పాత్ర పోషించిన తుంగా రాజగోపాలరెడ్డిగారికి ఉత్తమ నటుడిగా బహుమతి లభించింది కూడా. ఇదిలా వుంటే, 1980వ దశకంలో నెల్లూరులో కన్యాశుల్కం నాటకం ప్రదర్శనకు విచ్చేసిన ప్రఖ్యాత సినీనటుడు జెవి రమణమూర్తి నాటక వేదికపైనుంచి మాట్లాడుతూ, గిరీశం పాత్రకోసం నన్ను హైదరాబాద్ నుంచి పిలిపించడం ఎందుకూ?..నెల్లూరులో తుంగా రాజగోపాల్‌రెడ్డిగారు వున్నారు కదా.. అంటూ ప్రశంసించారు. ఆంధ్ర యూనివర్శిటీలో నా సహాధ్యాయి అయిన తుంగా రాజగోపాల్‌రెడ్డి కన్యాశుల్కంలోని గిరీశం పాత్రకు బంగారు పతకాన్ని అందుకున్నారు అని అంటూ, ప్రేక్షకుల్లో కూర్చుని వున్న తుంగా రాజగోపాల్‌రెడ్డిగారిని 'గోపాల్..వేదికపైకి రండి' అంటూ పిలిచి, ప్రేక్షకులకు పరిచయం చేశారు కూడా. ఆ మధురస్మృతులను స్మరించుకుంటూ, కన్యాశుల్కం నాటకానికీ, లాయర్ వ్యవస్థాపకులైన తుంగా రాజగోపాల్‌రెడ్డిగారికీ వున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ నెల్లూరులో కన్యాశుల్కం నాటక ప్రదర్శనకు తనవంతు హార్ధిక మరియు ఆర్థిక సహకారాన్నందించి ఆ మహనీయునికి నివాళులర్పించింది మా(మీ) 'లాయర్'.

## వంశీరాం బిల్డర్స్‌కు 'ఉత్తమ డెవలపర్స్ అవార్డు'

- కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు చేతులమీదుగా అవార్డు ప్రదానం



దేశంలోనే పేరెన్నికగన్న నిర్మాణసంస్థ వంశీరామ్ బిల్డర్స్ అధినేత, నెల్లూరీయుడు బి.సుబ్బారెడ్డి నిర్మాణ రంగంలో తాను చేసిన కృషికిగాను ప్రతిష్టాత్మకమైన 'నారెడ్కో' సంస్థ ద్వారా 'ఉత్తమ డెవలపర్'గా జాతీయ అవార్డును అందుకున్నారు. ఈ నెల 13వ తేదీన ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు చేతులమీదుగా ఈ అవార్డునందుకోవడం జరిగింది.

ఉత్తమ డెవలపర్‌గా, మధ్యతరగతి వర్గాలకు కూడా అందుబాటులో వుండేలా గృహనిర్మాణాలు చేపట్టడంలో వంశీరాం బిల్డర్స్ చేసిన ప్రయోగాలకు, ప్రయత్నాలకు ఈ పురస్కారంతో సత్కరించారు. 'నారెడ్కో' కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ అనుబంధ సంస్థ. ఈ సంస్థ ప్రతిసంవత్సరం ఉత్తమ బిల్డర్లను ఎంపిక చేసి సత్కరిస్తుంటుంది. అలాగే ఈ సంవత్సరం ఈ అవార్డులకు దేశవ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానించగా వచ్చిన దరఖాస్తులలో వంశీరామ్ బిల్డర్స్ అందిస్తున్న సేవలు, వారి నిర్మాణశైలి, వారు చేపట్టిన ప్రాజెక్టులను పరిశీలించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

నిర్మాణరంగంలో తన శైలిని కొనసాగిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్న వంశీరామ్ బిల్డర్స్ అధినేత సుబ్బారెడ్డికి, వారి సిబ్బందికి 'లాయర్' అభినందనలు.

## 'ప్రభా'తం

మనసులో ఎవరికి ఎలాంటి విభేదాలున్నా, సుహృద్భావ వాతావరణంలో కూర్చుని చర్చించుకుంటే, ఒకరికొకరు మనసువిప్పి మాట్లాడుకుంటే ఎంతటి జటిలమైన సమస్యలైనా ఒక కొలిక్కి వస్తాయనేందుకు ఇటీవల చైనా అధ్యక్షుని భారత్ పర్యటనలో ప్రధాని మోడీ అనుసరించిన స్పష్టమైన దౌత్య విధానాలు ఒక తాజా ఉదాహరణ. సాధారణంగా తొలినుంచీ సుహృద్భావంతో వున్న దేశాలతో సంబంధాలు మెరుగు పరచుకోవడం తేలికే..కానీ, సరిహద్దు వివాదాల్లాంటి క్లిష్టమైన సమస్యలు ఇంకా పూర్తిస్థాయిలో పరిష్కారం కాని నేపథ్యంలో, చైనా వంటి దేశంతో చెలిమిని మరింత ధృఢతరం చేసుకోవడమంటే మాటలు కాదు. ఇదెంతో కష్టసాధ్యం..సున్నితమైన అంశం కూడా. అలాంటిది ప్రధాని మోడీ ఎంతో సంయమనంతో, చాకచక్యంగా దౌత్యం నెరపి, ఆశించిన లక్ష్యాలు సాధించడం ఎంతో అభినందనీయం. చైనా అధ్యక్షుడు జీజిన్‌పింగ్ భారత్ పర్యటన భారత్-చైనాల మైత్రీబంధంలో మరొక మేలిమలుపుగా చెప్పవచ్చు. మరోవైపు ఇది ప్రధాని మోడీ సాధించిన మరో దౌత్య విజయమనే భావించవచ్చు.


ఈ నెల 17న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ పర్యటనలో భాగంగా, భారత ప్రధాని నరేంద్రమోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి తన పర్యటనకు శ్రీకారం చుట్టారు. ప్రధాని నరేంద్రమోడీ జిన్‌పింగ్‌ను ఘనంగా స్వాగతించారు. అనంతరం వారు సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మహాత్ముని విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జిన్‌పింగ్-ప్రధాని నరేంద్రమోడీ కొద్దిసేపు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో చైనా, గుజరాత్‌ల మధ్య మూడు ప్రధాన విషయాలపై ఒప్పందాలు జరగడం ఎంతో సంతోషకరం. చైనాలోని గ్యాంగ్‌ఝూను, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌ను సోదర నగరాలుగా అభివృద్ధి చేయడం, గుజరాత్‌లో పారిశ్రామిక పార్క్‌లు ఏర్పాటు చేయడం, చైనాలోని గ్వాన్‌డాంగ్ రాష్ట్రానికి గుజరాత్‌కు మధ్య సాంస్కృతిక, సామాజిక సంబంధాలను నెలకొల్పాలనే ధ్యేయంతో ఆ మేరకు ఒప్పందాలు జరగడం ఎంతైనా శుభ పరిణామం. అంతేకాదు, అనంతరం ఢిల్లీలో ఇరు దేశాధినేతల సమావేశంలోనూ మరిన్ని మంచి నిర్ణయాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా, ప్రధాని నరేంద్రమోడీ సరిహద్దు వివాదాల పరిష్కారానికి చైనా సత్వర చర్యలు తీసుకోవాలని స్పష్టం చేయడం, చైనా-భారత్ సంబంధాలు మెరుగుపడాలంటే ముందు సరిహద్దు అంశాలు పరిష్కారం కావాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు సూచించడం ప్రధాని మోడీ నిబద్ధతకు నిదర్శనంగా చెప్పవచ్చు. సరిహద్దుల వద్ద శాంతియుత పరిస్థితుల స్థాపనకు ఇరుదేశాలు కచ్చితంగా కట్టుబడి వుండాలని, ఇరుదేశాలు పరస్పర సమన్వయంతో ముందుకు వెళ్తూ ప్రగతిపథంలో సాగాలంటే సరిహద్దుల్లో శాంతి నెలకొనడం తప్పనిసరి అని ప్రధాని స్పష్టం చేయడం ప్రధాని మోడీ విస్పష్టమైన తీరుకు నిదర్శనమనే చెప్పాలి. అంతేకాదు, వాస్తవాధీన రేఖపై స్పష్టత రావాలని, దీనిపై నిలిచిపోయిన చర్చలను కొనసాగించాలని ప్రధాని సూచించారు. ఈ విషయమై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా భారతదేశ సరిహద్దు అంశాన్ని పరిష్కరించుకోవాలన్న కృతనిశ్చయంతో తామున్నామని అనడం ఇరుదేశాల మైత్రీపర్వంలో మరో మంచి పరిణామమనే భావించవచ్చు. అంతేకాదు, ఈ సందర్భంగా చైనా అధినేత జిన్‌పింగ్ భారత్‌లో పలు రంగాలకు అవసరమైన భారీ పెట్టుబడులను పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో, ప్రధాని మోడీ భారత్ అభివృద్ధి కోసం ఆశించిన లక్ష్యం నెరవేరినట్లయింది. భారత్‌లో రెండు పారిశ్రామిక పార్క్‌లు ఏర్పాటుచేస్తామని, వచ్చే అయిదేళ్ళలో దాదాపు లక్షా ఇరవై వేల కోట్ల రూపాయలకు పైగానే పెట్టుబడులు పెడతామని జిన్‌పింగ్ ప్రకటించారని, ఇరుదేశాల ఆర్థిక సంబంధాల్లో ఇది సరికొత్త అధ్యాయమని ప్రధాని నరేంద్రమోడీ సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా, ప్రధాని మోడీతో జరిగిన చర్చలు ఫలవంతమయ్యాయని, వచ్చే ఏడాది మోడీ చైనాకు రావల్సిందిగా ఆహ్వానించామని జిన్‌పింగ్ ప్రకటించడం, మోడీ నాయకత్వంలో భారత్ అభివృద్ధిపరంగా కొత్త శిఖరాలను చేరుకుంటుందని చైనా అధ్యక్షుడు పేర్కొనడం ఎంతో విశేషం.. ఈ సందర్భంగా రైల్వేల నుంచి రోదసి దాకా అనేక అంశాలపై చర్చించి, ఇరు దేశాధినేతలూ మరో 12 ఒప్పందాలు చేసుకున్నారు. ఆ మేరకు, భారతీయ రైల్వే వ్యవస్థను మరింత పటిష్టవంతం చేసేందుకు హైస్పీడ్ రైళ్ళు, రైల్వే స్టేషన్ల పునర్నిర్మాణం విషయంలోనూ సహకరించేందుకు చైనా సుముఖత వ్యక్తం చేయడం ఆహ్వానించదగిన పరిణామం. ఇలా పలు అంశాల్లో ఏకీభావానికి జిన్‌పింగ్ పర్యటన ఎంతో దోహదం చేసింది. మనదేశానికి సంబంధించి పలు రంగాల్లో ప్రగతికి మార్గం సుగమమైంది. భారత్‌కు సహకారం అందించే విషయంలో చైనా కొత్త చరిత్ర లిఖిస్తుందని భారత ప్రధాని నరేంద్రమోడీ చైనా అధ్యక్షుని రాకకు ముందురోజే ఆశాభావం వ్యక్తం చేశారు. అలా అన్నట్లుగానే, ప్రధాని అనుకున్నట్లుగానే జరిగింది. అంతేకాదు, చైనాతో అభివృద్ధిదాయకమైన భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నామని, ద్వైపాక్షిక సంబంధాలు పెంపొందించుకోవడానికి కృషి చేస్తున్నామని, చైనాతో సంబంధాలకు భారత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, గతంలో ఎన్నడూ లేనివిధంగా, ఇరుదేశాల్లో ఏకకాలంలో మార్పులు వచ్చాయని, ఇది రెండు దేశాలకు అపరిమితమైన అవకాశాలను తెచ్చిపెట్టనున్నాయని ప్రధాని మోడీ అన్నారు. చైనా అధ్యక్షుని జిన్‌పింగ్ పర్యటనలో జరిగిన సమావేశాలు, జరిగిన ఫలవంతమైన నిర్ణయాలు చూశాక.. ఆ మాటలు అక్షరసత్యాలు కావడం యాదృచ్ఛికమేమీ కాదు..ప్రధాని మోడీ ముందుచూపుకీ.. ఆయన విస్పష్టమైన విధానాలకీ..అంతులేని ఆత్మవిశ్వాసానికీ నిదర్శనమని చెప్పవచ్చు.



### బలపడుతున్న బంధం

చైనా అధ్యక్షుడు జీజిన్‌పింగ్ భారత్ పర్యటన ఎన్నో కీలకమైన అభివృద్ధి పనులకు బాటలు వేసింది. ఈ సందర్భంగా ప్రధాని మోడీతో జరిగిన చర్చలు ఫలవంతమయ్యాయని, వచ్చే ఏడాది మోడీ చైనాకు రావల్సిందిగా ఆహ్వానించామని, మోడీ నాయకత్వంలో భారత్ అభివృద్ధిలో కొత్త శిఖరాలను చేరుకుంటుందని జిన్‌పింగ్ పేర్కొనడం విశేషం.

# దొంగ నోట్లను పసిగట్టడం ఎలా?




వేగంగా దూసుకుపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సులభంగా నగదు లావాదేవీల్లో రూ1000, రూ500లు నోట్ల చలామణి అధికంగా జరుగుతుంది. దీన్ని అసరాగా తీసుకుని కొంతమంది స్వార్థ వ్యాపారులు, కేటుగాళ్ళు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ చట్ట వ్యతిరేకంగా దొంగనోట్ల చెలామణికి పూనుకుంటున్నారు. నెల్లూరు జిల్లాలో దొంగనోట్ల మారకం పెద్ద ఎత్తున సాగుతుంది. ఇలాంటి సందర్భాల్లో రూ1000, రూ500లు నోట్ల విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాల్సివుంది. ఏకాగ్రతగా పరిశీలిస్తే గాని దొంగనోట్లను గుర్తించలేనంతగా ప్రస్తుతం వాటిని తయారు చేస్తున్నారు. సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే కొన్ని సమస్యలు ఎదుర్కోవడంతోపాటు నగదును నష్ట పోవాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితులకు లోను కాకుండా దొంగనోట్లను ఎలా గుర్తించాలి? రిజర్వు బ్యాంకు సూచించిన విధంగా దొంగనోట్లను పరిశీలించడం ద్వారా తేడాను గుర్తించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించే అంశాలు ఇవి.

***ముఖ్యమైన చిహ్నాలు:*** నోటు పైన గుండ్రంగా ఉండే తెల్లని ప్రదేశాన్ని వెలుతురుకు అడ్డంగా పెట్టి చూసినప్పుడు మహాత్మాగాంధీ వాటర్ మార్క్ కనిపిస్తుంది.

***రక్షణదారం:*** నోట్ల పై సిల్వర్ రంగులో సెక్యూరిటీ థ్రెడ్ ఉంటుంది. దాని పై భారత్, ఆర్‌బిఐ అనే అక్షరాలను చూడవచ్చు.

***ఖచ్చిత రిజిస్ట్రేషన్:*** నోటుకు ఎడమ వైపున చివరన ముద్రించి ఉండే డిజైన్ కాగితానికి రెండు వైపులా రెండు విధాలుగా ఉంటుంది. ఆ ప్రాంతాన్ని వెలుతురు వైపు పెట్టి చూసినప్పుడు ఆ నోటు విలువను తెలిపే సంఖ్య కనిపిస్తుంది.

***స్పర్శ ద్వారా గుర్తించే అంశాలు:***

- నగదు నోట్లను కొన్ని ప్రాంతాల్లో చేతితో స్పర్శించడం ద్వారా అసలు, నకిలీ అనే తేడాను గురించవచ్చు.
- అసలు నోట్ల పై ఇంటాగ్లియో (ఉబెత్తుగా ఉండే) అక్షరాలతో ప్రతి నోటు పై ఎనిమిది చోట్ల ముద్రించడం జరుగుతుంది. నకిలీ నోట్ల పై ఉబ్బెత్తు అక్షరాల ముద్రణ ఉండదు.
- నగదు నోటు పై రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా, గ్యారంటెడ్ బై ది సెంట్రల్ గవర్నమెంట్ , మై భారత్‌కో, ఆర్‌బిఐ గవర్నర్ నోటు ఎడమ వైపు చివరన ఉండే డిజైన్, ఆర్‌బిఐ నాలుగు సింహాల చిహ్నం, రిజర్వు బ్యాంకు చిహ్నం, మహాత్మగాంధీ చిహ్నం పై ఉబ్బెత్తుగా ఉంటుంది.

***నోటును కదలించడంతో గుర్తించే విధానం:***

- నోటు మధ్యభాగంలో విలువను తెలియజేసే 500, 1000సంఖ్యలను చూస్తూ కదిలించడం ద్వారా మార్పిడిని గుర్తించవచ్చు.
- నకిలీ నోట్లను కదిలించినప్పుడు రంగు మారదు.

***దొంగ నోట్లను గురిస్తే ఏం చేయాలి?***

- బ్యాంకులో దొంగనోట్లను గుర్తిస్తే ఆ నోటును బ్యాంకు అధికారులు ఇంపౌండ్ చేయాల్సి వుంటుంది
- అలాంటి నోటు పై కౌంటర్ ఫీట్ బ్యాంకు నోటు అని స్టాంపు వేసి పోలీసుస్టేషన్‌కు విచారణ కోసం పంపాలి.
- దొంగ నోట్లను బ్యాంకుకు తీసుకువచ్చిన ఖాతాదారునికి ఆ నోటుకు సంబంధించిన వివరాలతో రసీదు ఇవ్వాలి.
- దొంగనోట్ల పై కౌంటర్ ఫీట్ బ్యాంకు నోటుగా స్టాంపు వేసే అధికారం ప్రభుత్వ, ప్రైవేటు,కోఅపరేటివ్, గ్రామీణ బ్యాంకులు ఖజానా కార్యాలయాలకు ఉంది.




## కుల పాలన

రాష్ట్రంలో ఎప్పుడూలేని విధంగా ఇప్పుడు కులపరమైన పాలన కనిపిస్తోంది. యూపీ, బీహార్ తరహా రాజకీయాలు ఇక్కడ కూడా కనిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో చైతన్యవంతులు. ప్రజా చైతన్యం వల్లే మన రాష్ట్రం అభివృద్ధి చెందుతూ వస్తుంది. గతంలో ఏ ముఖ్యమంత్రి హయాంలో కూడా కులఫీలింగ్ కనిపించలేదు. చంద్రబాబు గతంలో సీఎంగా పనిచేసినప్పుడు కూడా కులప్రభావం లేదు. కాని ఈసారి మాత్రం ఓ సామాజికవర్గం ఫీలింగ్ ఎక్కువుగా వుంది. ఇది ఎంతమాత్రం మంచిది కాదు.

***జి.సోమశేఖర్, రాపూరు.***

## సంకుచిత స్వభావం వీడాలి

తమకు ఓట్లు వేయని ప్రాంతాల మీద రాష్ట్ర ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు కక్షబూనడమనేది తొలిసారిగా చూస్తున్నాము. నెల్లూరుజిల్లాలో సీట్లు ఎక్కువ రాలేదని చెప్పి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ జిల్లా అభివృద్ధిపై సీతకన్ను వేయడం దురదృష్టకరం. ఒక ముఖ్యమంత్రి స్థాయి నాయకుడికి ఇంత సంకుచిత స్వభావం పనికిరాదు. సీట్లు, ఓట్లు శాశ్వతం కాదు. మొన్న ఎక్కువసీట్లు వచ్చిన జిల్లాల్లో రేపు చంద్రబాబుకు తక్కువ సీట్లు రావచ్చు, అదే సమయంలో నెల్లూరు జిల్లాలో ఎక్కువ రావచ్చు. కాబట్టి ఈ పక్షపాత ధోరణి వద్దు. ఆంధ్రప్రదేశ్‌ను విభజించాక నవ్యాంధ్ర నిర్మాణంలో చంద్రబాబు అయితేనే సరైన నిర్ణయాలు తీసుకుంటారని ప్రజలు భావించారు. అయితే ఆయన ఇలా కొన్ని ప్రాంతాలను పట్టించుకోక పోవడం ఆయా ప్రాంతాల వారికి బాధ కలిగిస్తుందని గుర్తించాలి.

***బి.కేశవులు, కలిగిరి.***

## ఐదేళ్ళు కష్టపడదాం...

సింగపూర్, చికాగో లాంటి రాజధాని అంటూ చంద్రబాబు గాల్లో మేడలు కడుతున్నాడు. గతంలో చేసిన తప్పే మళ్ళీ చేస్తున్నాడు. గతంలో సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్ర ఆదాయాన్నంతా హైదరాబాద్‌కే దోచిపెట్టాడు. మళ్ళీ సింగపూర్ అంటూ డబ్బంతా విజయవాడలో పెట్టేటట్లున్నాడు. మనకు అందమైన రాజధానులు అవసరం లేదు. రాజధానిని పరిపాలనకే పరిమితం చేయండి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ఈ ఐదేళ్లు కష్టపడదాం. టీఆర్ఎస్ నాయకులకు బుద్ధొచ్చేలా చేద్దాం.

***పి.పండరీ, నెల్లూరు.***

# కలిసుందాం రా...!

## దేశం నేతల మధ్య సమన్వయానికి దారులు

**తెలుగుదేశంపార్టీ అధికారంలో కొచ్చిందన్న మాటేగాని ఆ పార్టీకి సంబంధించి జిల్లా నాయకులలో పెద్దగా సంతోషం లేదు. పార్టీ అధికారంలో ఉన్నా వీళ్లకు మాత్రం ప్రతిపక్షంలో కూర్చున్నట్లుగానే ఉంది. ఎందుకంటే పార్టీకి సంబంధించిన ముఖ్యనాయకులెవరికీ పదవులు లేకపోవడమే.**







జిల్లాలో పార్టీని పదేళ్లపాటు మోసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓడిపోయాడు. పరసా రత్నం, బీద మస్తాన్‌రావు, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి వంటి సీనియర్‌లు పరాజయం పాలయ్యారు. ఏ పార్టీలో వున్నా రాజకీయాలను తన చుట్టూ తిప్పుకునే ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా ఎంపీగా ఓడిపోయాడు. దీంతో సీనియర్ నాయకులెవరూ కీలకమైన పదవుల్లో లేకుండాపోయారు.

రాజకీయాలతో ఏ మాత్రం సంబంధంలేని నారాయణ మంత్రి అయ్యాడు. జిల్లాలో సర్వాధికారాలు మంత్రికే దాఖలుపడ్డాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో రెడ్ల పెత్తనాన్ని తగ్గించాలని చెప్పి నారాయణకే అన్ని అధికారాలు కట్టబెట్టాడు. జిల్లా రాజకీయాలలో రాకెట్‌లా దూసుకుపొమ్మని స్వేచ్ఛనిచ్చాడు. నారాయణ స్వతహాగా రాజకీయనాయకుడై వుంటే అలానే చేసుండేవాడేమో! ఆయనకు సర్పంచ్‌గా చేసిన అనుభవం కూడా లేదు. ఒక్కసారిగా మంత్రిపదవి నిర్వహించాల్సివచ్చింది. ఒకపక్క శాఖాపరమైన పనులన్నీ చూసుకుంటూ ఇంకోపక్క జిల్లా రాజకీయాల్లో వేలుపెట్టాలంటే కష్టమే. దీనికితోడు నారాయణకు చంద్రబాబు తిండి తినే తీరక లేనన్ని బాధ్యతలు అప్పగించి ఉన్నాడు. కాబట్టి ఆయన నెలకోసారి జిల్లాకు రావాలన్నా గగనమే! ఈ పరిస్థితుల్లో జిల్లాలోని పార్టీ కేడర్‌కు అందుబాటులో ఉండాలన్నా, కార్యకర్తలకు కావాల్సిన పనులు చేయాలన్నా మిగిలిన నాయకులకు బాధ్యతలు పంచక తప్పదు. రాజకీయంగా నారాయణతో సోమిరెడ్డికి గాని, ఆదాలకు గాని, ఇతర నాయకులకుగాని ఎటువంటి రాజకీయ విభేదాలు లేవు. కాని ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లా పెత్తనమంతా నారాయణ చేతుల్లో పెట్టి, వీరిని నిమిత్తమాత్రులుగా చేసే ప్రయత్నాల వల్లే వీళ్లు నారాయణకు దూరమయ్యారు. దీంతో జిల్లా నాయకుల మధ్య సమన్వయం కొరవడి ఎవరి కుంపట్లు వాళ్ళు వెలిగించుకున్నారు. ఎవరి ఆఫీసులు వాళ్లు తెరుచుకున్నారు. నారాయణ కంటే సోమిరెడ్డి, ఆదాల, బీద రవిచంద్ర వంటి నాయకులు కార్యకర్తలకు ఎక్కువగా అందుబాటులో వుంటున్నారు. ఈ నేపథ్యంలో మంత్రికంటే జిల్లాలో వీరి హవానే ఎక్కువగా కనిపించసాగింది. వీళ్లను దూరం చేసుకుని వైరం పెంచుకోవడం కంటే దగ్గర చేసుకుని కలిసి పనిచేయడం మేలని నారాయణ నిర్ణయించుకున్నాడు. అన్ని పనులు తానొక్కడే చూసుకోలేడు కాబట్టి జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఎవరి పరిధిలో వారికి అధికారాలు అప్పగించాలనుకున్నారు. ఈ తరుణంలోనే ఇటీవల ఆదాల ప్రభాకర్‌రెడ్డిని కలిసారు. కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నారు. ఇక సోమిరెడ్డిని కూడా కలిసి ఇద్దరిమధ్య సమన్వయం కుదిరితే జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఒక దారిన పడ్డట్లే!

# నీరుగారిన నీరు-చెట్టు

***నగరాలు, పట్టణాలు కాంక్రీట్ అరణ్యాలుగా మారుతున్నాయి. చెట్లను నిలువునా నరికేస్తున్నారు. పర్యావరణం మంటగలసిపోతుంది. దీని ప్రభావంతోనే సంవత్సరంలోని 12 నెలల్లో 11నెలలు ఎండాకాలంగానే ఉంటుంది. చెట్లను నరుక్కుంటూపోతే, కొత్తగా చెట్లను పెంచకపోతే భవిష్యత్‌లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందనేదానికి ఇప్పుడు కాస్తున్న ఎండలే ప్రత్యక్ష సాక్ష్యం.***



చెట్లను పెంచాలనే సంకల్పంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 'నీరు-చెట్టు' కార్యక్రమాన్ని తెరమీదకు తెచ్చింది. నెల్లూరు నగరంలో ఈ కార్యక్రమం క్రింద లక్ష మొక్కలు నాటుతున్నట్లు మేయర్ అబ్దుల్ అజీజ్ ప్రకటించారు. ఒకట్రెండురోజులు ఈ కార్యక్రమంపై హడావిడి చేశారు. ఆయా డివిజన్‌లలో కార్పొరేటర్ల చేతులమీదుగా కొన్నేసి మొక్కలు నాటించేసి మమ అనిపించారు. లక్ష మొక్కలకు అసలు లెక్కే లేదు. ఇన్ని మొక్కలు నాటారా అనేది కూడా అనుమానమే. ఈ విధంగా ఒకేసారి మేయర్, కార్పొరేటర్లు వచ్చి మొక్కలు నాటినందు వల్ల ఉపయోగం కూడా లేదు. ఎందుకంటే వీళ్లు మొక్కలు నాటి పోతారు. మరి పక్కరోజు నుండి ఆ మొక్కలకు నీళ్ళు పోసేదెవరు?

మొక్కలు పెంచడం ఇలా కాదు. ప్రజలలోనే మొక్కలను పెంచాలనే ఆసక్తిని కలుగచేయాలి. చెట్లు లేకపోతే వచ్చే అనర్ధాలపై అవగాహన తేవాలి. చెట్ల పెంపకంలో ప్రజలను ప్రత్యక్ష భాగస్వాములను చేయాలి. ఇందుకు నగరపాలకసంస్థ పరిధిలోనే ఎన్నో మార్గాలున్నాయి. మనం పాతకాలంలో చూస్తే 50అంకణాల స్థలం వుంటే 20అంకణాలలో ఇళ్లు కట్టుకుని మిగతా 30అంకణాల స్థలంలో మంచి చెట్లు వేసుండేవాళ్ళు. ఇప్పుడు కమర్షియల్ కాలం వచ్చింది. చెట్లు పెంచడానికి 30అంకణాలు కాదు కదా మూడు అడుగులు కూడా వదలడం లేదు. 50అంకణాల స్థలం వుంటే ముందు రోడ్డు, వెనుక పోరంబోకు భూములను కూడా ఆక్రమించేసి ఐదంతస్థుల అపార్ట్‌మెంట్లు కట్టేస్తున్నారు. లేదంటే మెయిన్‌రోడ్ల పక్కన అంగుళం కూడా ఖాళీ వదలకుండా కమర్షియల్ కాంప్లెక్స్‌లు వెలుస్తున్నాయి. అపార్ట్‌మెంట్ కట్టాలంటే ఇన్ని అంకణాల కట్టుబడికి ఇన్ని అంకణాలలో చెట్లు పెంచాలి. అలా పెంచితేనే అపార్ట్‌మెంట్ మార్ట్‌గేజ్ రిలీజ్ చేయాలి. వ్యక్తిగతంగా ఇల్లు కట్టుకునే వాళ్లు కూడా ఇంత శాతం స్థలాన్ని చెట్లకు కేటాయించాలి. అలాగే నగరంలో వున్న చెట్లు కొట్టాలంటే అనుమతి తీసుకోవాలి. సొంత స్థలంలో చెట్లు కొట్టే వారిపై కూడా కేసులు పెట్టాలి. నగరంలో ఆయా ప్రాంతాల్లో రిజర్వు స్థలాలు నిరుపయోగంగా వున్నాయి. వీటిని పచ్చని గడ్డితో చిల్డ్రన్స్ పార్క్ మాదిరిగా చేయాలంటే ఖర్చుతో కూడుకున్నపని. దాని బదులు మామిడి, వేప, మర్రి, కానుగ చెట్లను పెంచవచ్చు. ఆయా ప్రాంతాల ప్రజలను ఆ దిశగా ప్రోత్సహించాలి. ఆయా కాలనీలలో సొసైటీలను ఏర్పాటు చేసి, వారిని రోడ్డుకిరువైపులా చెట్లు పెంచే దిశగా చైతన్యపరచాలి. చెట్లు బాగా పెంచుతున్న కాలనీలకు కార్పొరేషన్ పరంగా అన్ని వసతులు కల్పించాలి. ఇలా ప్రోత్సహిస్తే ప్రజల్లోనూ చెట్లను పెంచాలనే ఆసక్తి వస్తుంది. అందరూ తలో చెయ్యి వేసి తలా ఒక చెట్టు పెంచితే నెల్లూరు క్లీన్‌సిటీ కన్నా ముందుగా గ్రీన్‌సిటీ అవుతుంది.

# మిల్లర్లకు దన్నుగా సోమిరెడ్డి

## ఎస్పీతో వాగ్వాదం

జిల్లా నుండి యధేచ్ఛగా జరుగుతున్న అక్రమ రవాణాపై ఎస్పీ సెంథిల్‌కుమార్ ఇటీవల ఉక్కుపాదం మోపారు. పోలీసులు జరిపిన ఆకస్మిక తనిఖీలలో పెద్దఎత్తున ధాన్యం లారీలు పట్టుబడ్డాయి. ఇవన్నీ కూడా నెల్లూరు సమీపంలోని రైస్‌మిల్లర్లవే! ప్రతి యేటా ఈ సీజన్‌లో తమిళనాడుకు పెద్దఎత్తున ధాన్యం రవాణా అవుతుంటుంది. ప్రభుత్వం అనుమతించినదానికన్నా రెట్టింపుగా మిల్లర్లు ధాన్యాన్ని పంపిస్తుంటారు. అయితే ముందుగా సంబంధిత శాఖల అధికారులతో కుదిరిన అవగాహన మేరకు ఎటువంటి అడ్డంకులు లేకుండా ధాన్యం లారీలు చెన్నై చేరుతుండేవి. ఇలా అక్రమంగా ధాన్యాన్ని తరలిస్తూ నాలుగు రూపాయలు సంపాదిస్తుండబట్టే మిల్లర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండేవాళ్లు.

కాని ఈ సంవత్సరం ఎస్పీ దాడులతో అక్రమ రవాణాకు బ్రేక్ పడింది. పెద్దఎత్తున ధాన్యం లారీలను పట్టుకున్నారు. ధాన్యం లారీలను విడిపించేందుకు అధికారపార్టీ నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఒకరికి ఇద్దరు మంత్రులు చెప్పినా ఎస్పీ పట్టించుకోలేదు.

ఈ విషయమై ఇటీవల ఓ రోజు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫోన్‌లోనే ఎస్పీతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. డిజిపి కార్యాలయం నుండి ఎస్పీకి ఫోన్ చేయించి సోమిరెడ్డితో ఎస్పీని మాట్లాడించినట్లు సమాచారం. రైతుల వద్ద వున్న మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే కొనలేదు. మిల్లర్లు కూడా కొంటేనే రైతులకు గిట్టుబాటు ధరలొస్తాయి. రైతులకూ నాలుగురూపాయలొస్తాయి. పండిన పంటకు ఇక్కడ గిట్టుబాటు ధర లేకుంటే పక్క రాష్ట్రంలో అమ్ముకోవడం కొత్తేమీ కాదు. ఎప్పట్నుండో జరుగుతున్నదే! మీరు లారీలను ఆపారు కదా, ఆ ధాన్యాన్ని ప్రభుత్వం చేత మీరే కొనిపించండి, ఆ ధాన్యం గోడౌన్‌ల వద్ద చెడిపోతే ఎవరు బాధ్యత వహించాలి. ఈ జిల్లాలో గతంలో జస్పాల్‌సింగ్, భూపతిబాబు, శ్రీనివాసరెడ్డి వంటి ఎస్పీలు సిన్సియర్‌గా పనిచేశారు. వాళ్లు రౌడీయిజాన్ని అణిచేసి శాంతిభద్రతలు కాపాడారు. పోలీసుశాఖ ముందుగా వాటిపై దృష్టిపెట్టాలి. అక్రమ రవాణాను ఆపాలంటే ఎర్రచందనంను అడ్డుకోండి. రైతులకు లాభించే ధాన్యం రవాణాను అడ్డుకోవద్దని సోమిరెడ్డి ఫోన్‌లోనే కోరాడని సమాచారం. తన పరిధిలో తాను డ్యూటీ చేస్తానని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఏదీ సహించేది లేదని ఎస్పీ కూడా ఖరాఖండీగా చెప్పినట్లు తెలుస్తుంది. ఎస్పీ మాత్రం జిల్లాలో అధికారపార్టీ నాయకులకు ఏ విధంగానూ మింగుడుపడడం లేదు.

# మూడు పార్టీల నేతల్లో నిరుత్సాహమే!

***జిల్లా రాజకీయచరిత్రలో తొలిసారిగా స్థబ్దత నెలకొంది. జిల్లాపరంగా అసలు ఎటువంటి రాజకీయ ప్రాధాన్యత లేకుండా పోయింది. అయితే ఈ స్థబ్దత ఒక్క ప్రతిపక్షానికే పరిమితం కాలేదు. అధికార పక్షం పరిస్థితి కూడా ఇంచుమించు ఇలాగే వుంది. బహుశా ఈ పరిస్థితికి రాష్ట్ర విభజన, ఆర్థికలోటు వంటివి కూడా కారణాలు అనుకోవచ్చు.***

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందనేగాని జిల్లాలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పెద్దగా సంతోషం లేకుండా పోయింది. పార్టీలో ముఖ్య నాయకులు ఓడిపోవడం, ఎన్నికల తర్వాత ఇతర పార్టీల నుండి వచ్చిన నాయకులు పార్టీలో పెత్తనం చేస్తుండడాన్ని వీళ్ళు ఓ పట్టాన జీర్ణించుకోలేకపోతున్నారు. అదీగాక రాబోయే ఐదేళ్లలో జిల్లాలో ఒక్క అభివృద్ధి పని జరిగే పరిస్థితి లేదు. అంతేగాక ఈ జిల్లా మీద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కక్షగట్టినట్లుగా వ్యవహరిస్తుండడంతో భవిష్యత్‌లో పార్టీ ఇంకా ఇబ్బందుల్లో పడుతుందేమోనని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఇక ఇంతవరకు పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వలేదు. అధికారుల బదిలీలు తప్పితే ఏ పనులు జరిగే అవకాశం లేకపోవడంతో తెలుగు తమ్ముళ్ళలో నిరుత్సాహం అలుముకుంది.

ఇక వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో పరిస్థితి భిన్నంగా వుంది. నిన్నటి ఎన్నికల్లో నోటి దాకా వచ్చిన అధికారం జారిపోయింది. ఈ జిల్లా నుండి ఇద్దరు ఎంపీలను, ఏడు మంది ఎమ్మెల్యేలను గెలిపించినా, ఆ సంతోషం లేదు. పార్టీ అధికారంలోకి రాకుండా వీళ్లు గెలిచి లాభం లేదు. గ్యారంటీగా అధికారంలోకి వస్తుందనుకున్న పార్టీ అధికారంలోకి రాకపోగా, అధికారం కోసం ఇంకో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన పరిస్థితి. సాధారణ ప్రజలకైతే రాబోయే ఐదేళ్లు ఐదు గంటలుగా గడిచిపోతాయి. కాని వైకాపా నాయకులకే ఐదేళ్లు ఐదు యుగాలుగా గడవడం ఖాయం. ఈ ఐదేళ్లు పార్టీని నడపడం పెద్ద అగ్నిపరీక్షే! ఇన్నేళ్లు అధికారానికి దూరంగా వుండలేక ఒకరిద్దరు వైకాపా ఎమ్మెల్యేలు తెలుగుదేశంలోకి జంప్ అవుతున్నారనే టాక్ కూడా వచ్చింది. కాని తెలుగు దేశంలో పరిస్థితి ఇక్కడికంటే ఘోరంగా వుండడంతో పాలు కోసం పరుగెత్తడం కంటే నిలబడి నీళ్లు తాగడమే మేలను కున్నారు.

ఎన్నికలకు ముందు పోయే వాళ్లంతా పోగా, ఎన్నికల తర్వాత కొంతమందిని తీసేయగా కాంగ్రెస్‌లోనూ కొందరు నాయకులు మిగిలారు. వాళ్లకు ఏ పార్టీలోకి పోవాలో అర్ధంకావడం లేదు. తెలుగు దేశంలో చూస్తే ఉన్నోళ్లకే దిక్కులేదు. వైకాపా చూస్తే ఇంకో ఐదేళ్లదాకా పోవాల్సిన పనిలేదు. కాంగ్రెస్‌లోనే ఉందామా అంటే రాష్ట్రంలోనే ఇక ఆ పార్టీ కోలుకునే పరిస్థితి లేదు.

మొత్తానికి చూస్తే మూడు పార్టీల్లోనూ పరిస్థితులు నిరాశాజనకంగానే వున్నాయి.

# నెల్లూరు కబుర్లు

## మంత్రులు, మేయర్ చెన్నై పర్యటన

చెన్నైలోని అమ్మా క్యాంటిన్‌ల తరహాలో, సీమాంధ్రలోని కొన్ని జిల్లాల్లో కూడా అలాంటి క్యాంటిన్‌లు పెట్టి, తక్కువ ధరకు భోజనం, ఉపాహారం అందించాలని చేస్తున్న కృషిలో భాగంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనల మేరకు పలువురు మంత్రులతో పాటు, నగర మేయర్ అబ్దుల్ అజీజ్ కూడా చెన్నైలో పర్యటించారు. ఈ నెల 19న మంత్రులు డాక్టర్ పి.నారాయణ, పౌరసరఫరాల శాఖ మంత్రి పరిటాల సునీత, వ్యవసాయ మంత్రి పత్తిపాటి పుల్లారావు, పలువురు ఉన్నతాధికారులతో పాటు నెల్లూరు మేయర్ అజీజ్ చెన్నైలోని పలు అమ్మా క్యాంటిన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా నగర మేయర్‌ను చెన్నై మేయర్ దొరైస్వామి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజధాని కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా అభివృద్ధికి మంత్రి చొరవచూపాలి

ఆంధ్రరాష్ట్ర మునిసిపల్ శాఖామంత్రి నారాయణ నెల్లూరు నగర కార్పొరేషన్‌పై దృష్టి సారించి పేద, మధ్య తరగతి కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతాలపై శ్రద్ధపెట్టి నెల్లూరు కార్పొరేషన్‌ను ఆదర్శవంతమైన కార్పొరేషన్‌గా తీర్చిదిద్దాలని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఇటీవల 17వ డివిజన్‌లోని శ్రామికనగర్, అపోలో హాస్పిటల్ సెంటర్, మధురానగర్‌లో కోటంరెడ్డి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని మునిసిపల్ అధికారులకు తక్షణం సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఊటుకూరు మాధవ్, కె.సతీష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాము, మనోహర్, యస్.కె.నజీర్, బి.ప్రసాద్, చాన్‌బాషా, పవన్, తిరుపతి, పి.అజయ్, హైమావతి, మహాలక్ష్మమ్మ, నాగేశ్వరరావు, సాంబయ్య, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

### గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్

## అధ్యక్షుడిగా నలుబోలు



గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ అండ్ సేవ్ టెంపుల్స్ ఆర్గనైజేషన్(యుయస్ఏ) సంస్థ నెల్లూరుజిల్లా అధ్యక్షునిగా నలుబోలు బలరామయ్య నాయుడును ట్రిబుల్ గిన్నీస్ వరల్డ్‌రికార్డ్ హోల్డర్ మాస్ట్రో డా॥ గజల్ శ్రీనివాస్ 20వ తేదీన నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన దేవాలయ పరిరక్షణ సదస్సులో ప్రకటించారు. సమన్వయకర్తగా మైపాడు రాజాను నియమించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వెలగపూడి ప్రకాశరావు, సాంస్కృతిక రాయబారి డా॥ గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దేవాలయాలు, గోమాతలు, అర్చకుల పరిరక్షణను ఈ సంస్థ పర్యవేక్షిస్తుంది.




### ఉక్కుమనిషి విగ్రహానికి

## చురుగ్గా ఏర్పాట్లు

నెల్లూరు నగరంలో కరెంట్ ఆఫీసు సమీపంలో రిత్విక్ ఎన్‌క్లేవ్ వద్ద జీఎన్‌టి రోడ్డుపై ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహ నిర్మాణానికి ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రిత్విక్ ఎన్‌క్లేవ్ లోనే కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఇల్లుంది. ఇక్కడ పటేల్ విగ్రహం పెట్టాలన్న ఆలోచన ఆయనదే! ఇక్కడ రోడ్డుపై ఐలాండ్‌తో పాటు రిత్విక్ ఎన్‌క్లేవ్ ప్రధాన వీధికి ఆర్చ్ నిర్మాణం కూడా చేపడుతున్నారు. పటేల్ గారి విగ్రహావిష్కరణ కూడా త్వరలోనే ఉండొచ్చు.

## చెత్త సేకరణ రిక్షాలను పరిశీలించిన జేసి

నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉన్న చెత్త సేకరణ రిక్షాలను ఇటీవల నెల్లూరు జాయింట్ కలెక్టర్ జి.రేఖరాణి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ రిక్షాలను కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు రిక్షాలను కొనుగోలు చేసి మార్కెట్‌లో వినియోగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఓ ఎం.జితేంద్ర పాల్గొన్నారు.

## అన్నదానం

నెల్లూరు, శ్రీ రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని నవలాకులతోట ఏటిగట్టు ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు, సాయిబాబా గుడి ప్రాంతంలో వున్న గిరిజనులకు అన్నదానం చేసినట్లు కార్యదర్శి జి.జయచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.లక్ష్మినారాయణ, ఎన్.కొండయ్య, జి.ప్రసాద్ పాల్గొని సేవలు అందించినట్లు పేర్కొన్నారు.

### విద్యార్థులకు

## పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ

నెల్లూరుజిల్లా ప్రజావాకర్స్ సంఘం ఆద్వర్యంలో ఇటీవల జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల గిరిజన వసతిగృహంలోని విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, పరీక్ష ప్యాడులు, తెల్లకాగితాలు, యూనీఫాం, ఆటవస్తువులు పంపిణీ చేసినట్లు ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

## నేత్రదానం



డాక్టర్ బెజవాడ గోపాల రెడ్డి అవార్డు కమిటీ కార్యదర్శి బి.వి.నరసింహం సోదరీమణి వాయిగుండ్ల లక్ష్మీనారాయణమ్మ(80) సోమవారం పరమపదించారు. ఆమె బ్రతికుండగానే తాను మరణించిన తర్వాత తన నేత్రాలను దానం చేయాలని కోరిన కోరిక మేరకు ఆమె నేత్రాలను నెల్లూరు మాడరన్ ఐఫౌండేషన్ వారు సేకరించారు. లక్ష్మీనారాయణమ్మ మరణించినా ఆమె కళ్ళు యీ లోకాన్ని చూస్తూ మరో ఇద్దరికి చూపును ప్రసాదించాయి.

# నెల్లూరులో దసరా శోభ

## శ్రీ రాజరాజేశ్వరిదేవికి వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు



దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నెల్లూరు దర్గామిట్టలో వెలసివున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం విద్యుత్ శోభలతో, నవరాత్రి కళకళలతో అలరారుతోంది. నిత్యం ఈ ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తులు తరలి వస్తుండడంతో ఆలయం భక్తజనసందోహంతో కిటకిటలాడుతోంది. భక్తులకు అసౌకర్యం లేకుండా ఆలయ నిర్వాహకులు పటిష్టంగా అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతిరోజూ అమ్మవారికి విశేషపూజలు, విశిష్ట అలంకారాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 25వ తేది నుంచి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ, ఎస్.రఘురామమూర్తి, వి.సంజీవ రావుస్వామి బృందం ఆధ్వర్యంలో ఆగమశాస్త్రోక్తంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు, అలంకారాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 25వ తేదిన అమ్మవారికి చండీ అలంకారాన్ని కన్నులపండువగా నిర్వహించారు. వేకువనుంచే ఆలయానికి మహిళా భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి, అమ్మవారిని దర్శించుకున్నారు. 26వ తేదిన అమ్మవారికి శ్రీ భవాని అలంకారం, 27న శ్రీ గాయత్రి అలంకారం, 28న అన్నపూర్ణ అలంకారం, 29న గజలక్ష్మీ అలంకారం, 30న కాళిక అలంకారం, వచ్చే నెల1న సరస్వతీ అలంకారం నిర్వహిస్తారు. 2వ తేదిన దుర్గా అలంకారం, మహిషాసురమర్దిని అలంకారం నిర్వహిస్తారు. 3వ తేదిన విజయదశమి పర్వదినం సందర్భంగా అమ్మవారికి శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారాన్ని కన్నులపండువగా నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 10.30 గంటల నుంచి అమ్మవారి నగరోత్సవం మరింత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. 4వ తేదిన మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి సన్నిధిలో, ఉభయకర్తల సహకారంతో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా, ఈ నెల 25 నుంచి వచ్చే నెల 3వ తేది వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి నవావరణ పూజ, అష్టోత్తర, సహస్రనామపూజలు, సాయంత్రం 5 గంటల నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 3వ తేది వేకువన 4 గంటలకు మహాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. భక్తులందరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి కృపాకటాక్షానికి పాత్రులు కావాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు కోరారు.

## ఏ.సికి నివాళులు



మాజీమంత్రి స్వర్గీయ ఏ.సి.సుబ్బారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 20న నెల్లూరు ఏ.సి. సెంటర్‌లోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగర అభివృద్ధికి పునాది వేసింది ఏ.సి.సుబ్బారెడ్డేనన్నారు. అప్పట్లోనే నగరంలో సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీ వసతి కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, బర్నాబాసు, రంగయ్యనాయుడు, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, పత్తి రవీంద్రబాబు, ప్రేమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాకాటికి జన్మదిన శుభాకాంక్షలు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి 52వ జన్మదినం సందర్భంగా భారత వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ కనకట్ల రఘురాం ముదిరాజ్ ఆదివారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా 52కిలోల కేక్‌ను కట్ చేసి నగరంలోని అయ్యప్పగుడి వద్దనున్న ప్రగతి ఛారిటీస్ మానసిక వికలాంగుల పాఠశాలలోని విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీసిఎంఎస్ డైరెక్టర్ జెట్టి వేణుయాదవ్, కాంగ్రెస్ నాయకులు అలవల సురేష్, బుర్లా వెంకటేశ్వర్లుగౌడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆడాళ్ళూ!..మీకు జోహార్లు!

- మహిళలే మహరాణులు
- మహిళా సాధికారత దిశగా గూడూరు డివిజన్








ఆడవాళ్ళు వంటింటికే పరిమితం కావాలనుకునే పాతకాలపు రోజులు ఎప్పుడో పోయాయి. మహిళలు కేవలం అబలలు అనుకుంటే పొరపాటే. మహిళలు ఇప్పుడు అన్ని రంగాల్లో రాకెట్టు వేగంతో ముందుకు దూసుకుపోతున్నారు. మహిళలు తలచుకోవాలే గానీ, ఏ రంగంలోనైనా సరే.. పురుషులకంటే ఏమాత్రం తీసిపోకుండా ప్రతిభతో.. ప్రగతితో రాణిస్తూ, తమ సత్తా ఏమిటో చూపిస్తున్నారు. ఒక్క విద్య-విజ్ఞానరంగాల్లోనే కాదు, సాహసోపేతమైన ఉద్యోగాల్లోనూ, వృత్తుల్లోనూ, వ్యాపార-పారిశ్రామిక రంగాల్లోనూ.. చివరికి ఎంతో క్లిష్టమైన పరిపాలనా రంగంలో కూడా మహిళలు ధీటుగా రాణిస్తున్నారు. మహిళలే మహరాణులని నిరూపిస్తున్నారు.

మహిళా సాధికారతను కోరుకుంటూ, పురుషులతో సమానంగా మహిళలకు కూడా సమాజంలో సముచిత స్థానం వుండాలనీ, అప్పుడే సమాజ పురోభివృద్ధికి సరైన బాటలు వేసినట్లుంటుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తూ, అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుండడంతో, మహిళలు ఆ అవకాశాలను అందిపుచ్చుకుంటూ, ఆయా రంగాల్లో ప్రగతిని సాధిస్తూ తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు. అటు గృహిణిగా, తల్లిగా కుటుంబ బాధ్యతలను నిరంతరం అంకితభావంతో నిర్వర్తిస్తూనే..మరోవైపు వృత్తిపరంగా, పాలనాపరంగా ఎందరో మహిళామణులు ఈ సమాజాభివృద్ధికి అహరహం కృషి చేస్తూనే వుండడం ఎంతైనా అభినందనీయం.

నెల్లూరుజిల్లాలోని గూడూరు డివిజన్ ఇందుకు మంచి ఉదాహరణ. ఇక్కడ మహిళలదే హవా. పరిపాలనా రంగంలో పురుషులకు ధీటుగా ఇక్కడి మహిళలు మంచి పురోభివృద్ధిని సాధిస్తున్నారు. పాలనాపరమైన కీలక పదవుల్లో, బాధ్యతల్లో వుంటూ, సమాజాభ్యున్నతికి తమ వంతు బాటలు వేస్తూ ముందుకు సాగుతున్నారు. గూడూరు మునిసిపల్ ఛైర్‌పర్సన్‌గా పొనకా దేవసేన మంచి పాలన అందిస్తూ, ఇక్కడ అందరి మన్ననలూ అందుకుంటున్నారు. ప్రోత్సాహం వుండాలే కానీ, మహిళలు ఏ రంగంలోనైనా రాణిస్తూ ఆదర్శవంతంగా నిలుస్తారనేందుకు దేవసేన ఒక ప్రత్యక్ష ఉదాహరణ. కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, ఛైర్‌పర్సన్‌గా అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారామె. ప్రతిరోజూ పట్టణంలోని పలు వార్డులను సందర్శించి, అక్కడి సమస్యలు తెలుసుకోవడం, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఆమె రోజువారీ కర్తవ్యం. పరిపాలనా పరమైన బాధ్యతలు నిర్వర్తించడం కొంచెం కష్టతరమే అయినప్పటికీ, ఈ బాధ్యతలను చేపట్టి ప్రజలందరి సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం రావడం తనకెంతో సంతోషం, సంతృప్తి కలిగిస్తోందని ఆమె సంతోషంగా చెప్తున్నారు. అదేవిధంగా, గూడూరు పట్టణ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆర్. అనూరాధ మహిళా అధికారిగా, పట్టణాభివృద్ధికి ఎంతో బాధ్యతాయుతంగా పనిచేస్తుండడం ఇక్కడి ప్రజలకు సంతోషం కలిగిస్తోంది. మునిసిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్ ఇద్దరూ మహిళలే కావడంతో, పట్టణంలోని సమస్యలను వారు ఎంతో ఓపికతో, సంయమనంతో తెలుసుకుంటూ, ఆ సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తున్నారు. ఇక గూడూరు డివిజన్ పోలీసు శాఖలో ఎంతో కీలకమైన బాధ్యత డిఎస్పీదే. నేరాలు, ఘోరాలు అదుపుచేయడం, స్మగ్లింగ్‌ను నిరోధించడం, చోరీలను అరికట్టడం, శాంతి భద్రతల పర్యవేక్షణ సక్రమంగా నిర్వహించడం వంటివేమీ చిన్నవిషయాలు కాదు. అంతటి క్లిష్టమైన బాధ్యతలను కూడా ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తూ గూడూరు డిఎస్పీ చౌడేశ్వరి ప్రజలందరి ప్రశంసలు అందుకుంటున్నారు. పోలీసుశాఖలో అటు ఉన్నతాధికారులు, ఇటు కిందిస్థాయి సిబ్బంది సహకారంతో ఆమె డివిజన్‌లో నేరాల నిరోధానికి గట్టి కృషి చేస్తున్నారు. మహిళే అయినప్పటికీ, ఎలాంటి సంకోచం లేకుండా, నిర్భయంగా వుంటూ సాహసోపేతమైన ఈ వృత్తిలో రాణిస్తూ, నేరస్తులను హడలెత్తిస్తూ..మహిళల సత్తా ఏమిటో నిరూపిస్తున్నారు. ఇకపోతే గూడూరు తహశీల్దారు వెంకటనారాయణమ్మ, వాణిజ్య పన్నుల అధికారి పి. లక్ష్మీమాధవిలతో పాటు, ఎంపిడిఓ జి.కె నిర్మలాదేవి, మండల పరిషత్ అధ్యక్షురాలు పిట్ల రావమ్మ, ఇంకా ముగ్గురు జడ్పీటిసిలు, పట్టణంలోని మరో 18మంది కౌన్సిలర్లు... మహిళామణులే కావడం విశేషం. అంతేకాక, మరో మూడు మండలాల్లో అధ్యక్షపీఠాలు కూడా మహిళలవే. ఇలా అటు ప్రభుత్వ పరంగా, ఇటు పాలనా పరంగా మహిళలు కీలక పదవు ల్లోనూ రాణిస్తుండడం, ఆయా రంగాల్లో తమ ప్రతిభను చాటుతుండడం ఎంతో ఆశ్చర్యకరం కూడా. ఈ డివిజన్‌లో ఇంత మంది మహిళలు పురుషులకంటే ధీటుగా, పలు కీలకస్థానాల్లో, కీలక పదవుల్లో సైతం బేషుగ్గా రాణిస్తుండడం చూస్తుంటే, మహిళా సాధికారత అంతా ఇక్కడే కొలువు దీరిందా అన్నట్లు ఎంతో సంతోషం కలుగుతుంది. ఏదేమైనా ఒక్క డివిజన్‌లోనే ఇంతమంది మహిళలు ప్రతిభావంతంగా విధులు నిర్వహిస్తుండడం ఎంతైనా అపూర్వం.. అద్భుతం. ఆ మహిళామతల్లులు, మహిళామణులందరికీ... హృదయపూర్వక అభినందనలు.

## కండలేరు ఎడమగట్టు కాలువకు లిఫ్ట్ ఇరిగేషన్

**- సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి**




నెల్లూరుజిల్లాలోని కండలేరు ఎడమగట్టు కాలువకు లిఫ్ట్ ఇరిగేషన్(ఎత్తిపోతల పథకం) మంజూరైందని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కాకాణి విలేకర్లతో మాట్లాడుతూ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల నిమిత్తం ప్రభుత్వం రూ. 61కోట్లను మంజూరు చేస్తూ జిఓను జారీ చేసిందన్నారు. రైతాంగానికి ఎంతగానో ఉపయోగపడే ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. కండలేరు ఎడమగట్టు కాలువ జలాశయం నుంచి సక్రమంగా నీరు అందక ప్రతి సంవత్సరం ఇబ్బందులు పడే పొదలకూరు మండల మెట్ట రైతాంగానికి మంజూరు కావడం తీపికబురు లాంటిదన్నారు.

## ఆలయాల పవిత్రతను కాపాడుకోవాలి

**- గజల్ శ్రీనివాస్**




గజల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వేదపండితులు

ఆలయాల పవిత్రతను మనందరం కాపాడుకోవాలని, ఆలయాల్లో ధార్మికపరమైన కార్యక్రమాలు, భక్తిని ప్రబోధించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలే తప్ప ఎలాంటి అసభ్యకరమైన, అనుచితమైన నృత్యాలకు, ప్రదర్శనలకు తావుండకూడదని ప్రఖ్యాత గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 20న గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ అండ్ సేవ్ టెంపుల్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నగరంలోని టౌన్‌హాలులో ఆలయాల పరిరక్షణ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, దేవాలయాల పవిత్రతకు భంగం వాటిల్లితే సహించేది లేదన్నారు. దేవాలయాల్లో అనుచిత కార్యక్రమాలకు చోటు లేకుండా చూడాలన్నారు. ఈ సదస్సు సందర్భంగా జిల్లాలోని అరవై మంది అర్చకులకు గోమాత సత్కారాన్ని అందజేశారు. జిల్లా అర్చక సమాఖ్య పరాంకుశ అనంతపద్మనాభప్రసాద్, కో-ఆర్డినేటర్ మైపాడు రాజు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మాచవోలు రాజశేఖరశాస్త్రి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రారెడ్డి, డాక్టర్ కొల్లూరి, వాకాటి విజయకుమార్‌రెడ్డి, నిర్మల ఏజెన్సీస్ అధినేత నరసింహారెడ్డి, ఎం. చంద్రశేఖర్ అవధాని, ఆలూరి శిరోమణిశర్మ, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. తొలుత గజల్ శ్రీనివాస్ ఆలపించిన గజల్స్ అందరినీ అలరించాయి.

## 'దేశం' వైపు ధనుంజయ



అన్నీ కుదిరితే ఫైనల్‌గా మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పచ్చజెండా వూపితే జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి త్వరలోనే తెలుగుదేశంపార్టీలో చేరవచ్చు. ఈమేరకు తెలుగుదేశం నాయకులు మెట్టుకూరుతో సమాలోచనలు జరిపారు. ఆయన కూడా తెలుగుదేశంలో చేరేందుకు సిద్ధంగానే వున్నా, ఆనం రామనారాయణరెడ్డి అనుమతి లేనిదే ఆయన ముందడుగు వేయకపోవచ్చు.

త్వరలో ఆప్కాబ్ ఛైర్మెన్ ఎన్నిక జరగనుండి. ఛైర్మెన్ పదవిని దక్కించుకోవాలంటే తెలుగు దేశంకు మెట్టుకూరు ఓటు అవసరం. ఈ నేపథ్యంలో జిల్లా నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్రలు మెట్టుకూరుతో చర్చించారు. దీనిపై మెట్టుకూరు సానుకూలంగానే స్పందించినట్లు సమాచారం. అయితే ఆనం రామనారాయణరెడ్డి ఒప్పుకుంటేనే ఆయన తెలుగుదేశంలో చేరతానని చెప్పడం జరిగింది. ఆనం అనుమతిస్తే ధనుంజయరెడ్డి సైకిల్ ఎక్కడం ఖాయం. మొన్న ఎన్నికలప్పుడే ధనుంజయరెడ్డిని తెలుగుదేశంలోకి తీసుకొచ్చేందుకు ఆదాల ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. ఆయనను ఆత్మకూరు అసెంబ్లీ అభ్యర్థిగా నిలబెట్టాలని ఆదాల విశ్వప్రయత్నాలు చేశారు. ఆ విధంగా జరిగివుంటే ఆత్మకూరు అసెంబ్లీతో పాటు నెల్లూరు ఎంపీగా కూడా ఆదాల గెలిచి ఉండేవాడు. కాని ఆరోజు ఆత్మకూరు కాంగ్రెస్ అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి పోటీకి దిగడంతో ధనుంజయరెడ్డి ఆయనను కాదని తెలుగుదేశంలోకి రాలేకపోయాడు. కాని ఈసారి మాత్రం ఆనం అడ్డుచెప్పే అవకాశాలు లేకపోవడంతో ధనుంజయరెడ్డి తెలుగుదేశంలో చేరే అవకాశముంది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





## గూడూరు డివిజన్ వార్తలు

# సమస్యలపై కౌన్సిల్ తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, ప్రక్కన ఎమ్మెల్యే పాశం సునీల్

గూడూరు పట్టణ పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ప్రజాసమస్యలకు ప్రాధాన్యమిచ్చి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలంటూ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, కౌన్సిలర్లు తీర్మానించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు వంటివి ప్రజలకు ఎంతో అవసరమని తీర్మానించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, కమిషనర్ అనురాధ, కౌన్సిలర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో కౌన్సిల్లో చర్చించిన అంశాలు, గత సమావేశంలో ప్రతి వార్డు అభివృద్ధి పనులకు రూ.2లక్షలు కేటాయించడంతో కౌన్సిలర్లు అందరూ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదించడంతో వాటిని ఆమోదించారు. పట్టణంలో వున్న గ్రంథాలయాలకు అన్ని దినపత్రికలు వేయాలన్నారు. తాగునీటి నాణ్యత పాటించాలని, పట్టణంలో నీటి సరఫరా కేవలం కండలేరు పథకంపై ఆధారపడకుండా ముందస్తు జాగ్రత్తగా ప్రత్యామ్నాయంగా ఉన్నవాటిని పరిశీలించి వాటి కోసం నిధులు కేటాయించాలన్నారు. పురపాలక సంఘ ఆస్తులు పట్టణంలో ఎన్ని ఉన్నాయో పరిశీలించి పాతపడ్డ భవనాలను కూల్చి వేయాలని తీర్మానించారు. బీపీయల్ కొళాయిలకు రూ.200లు కట్టించుకొని కనెక్షను ఇవ్వాలని తీర్మానించారు. పట్టణంలో అన్ని వార్డుల్లో వీధిలైట్లు వెలిగేలా తీర్మానం చేశారు. పట్టణంలో నిబంధనల ప్రకారం లేని లేఅవుట్లను అధికారులు పరిశీలించాలన్నారు. సమాచార చట్టం క్రింద దరఖాస్తు చేసుకోవడం ప్రతి పౌరుడి హక్కు అని కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. అజెండాలో 115వ అంశంగా ఎన్.మునీంద్రారెడ్డి పదేపదే సమాచార సహచట్టం దరఖాస్తు చేస్తున్నారని, ఉన్న సమాచారం ఇచ్చినా సంతృప్తిగా లేదంటూ అప్పీలు చేస్తున్నారని, దీంతో సిబ్బంది పనులకు ఆటంకంగా వుందని అజెండాలో పొందుపరిచారు. దీనిపై ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన స్పందించి ఈ విషయాన్ని చర్చించాల్సిన అవసరం లేదని, సహచట్టం ప్రతిఒక్కపౌరుడి హక్కని పేర్కొన్నారు.

# భూ ఆక్రమణలను అరికట్టండి



వెంకటనారాయణమ్మను తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు

గూడూరు మండలంలోని దీవిపాళెం పంచాయతీలోని పలు ప్రాంతాల్లోని భూములు కొందరు యధేచ్ఛగా ఆక్రమించుకొని సాగుచేస్తున్నారని దీవిపాళెం వార్డుసభ్యులు, గ్రామస్థులు తహశీల్దార్ వెంకటనారాయణమ్మకు సోమవారం నాడు ఫిర్యాదు చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహించారు. అలాగే మండలంలోని విఆర్వోలతో పాసుపుస్తకాల వెబ్ ల్యాడింగ్‌పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలి

**- డాక్టర్ బత్తల రాధాజ్యోత్స్నలత**



రైతుల భూములను సేకరించి నిర్మించిన పరిశ్రమల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని గూడూరు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ బత్తల రాధాజ్యోత్స్నలత కోరారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథిగృహంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూములు కోల్పోయి ఉపాధిలేక రైతు కుటుంబాల్లోని వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్థానికేతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి స్థానికులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 55ఏళ్ళు నిండిన గీతకార్మికులకు ఫించను మంజూరు చేయిస్తామన్నారు. కార్యకర్తలు చెప్పిన సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి చొరవ చూపుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, గోను శివకుమార్, ఎస్వీ రమణారెడ్డి, శ్రీధర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## మినీగురుకుల పాఠశాలలో లయన్స్‌క్లబ్, న్యూ మోడరన్ ఐ క్లినిక్



కంప్యూటర్ ద్వారా విద్యార్థులకు కంటి పరీక్షలు

గూడూరులోని మినీ గురుకుల పాఠశాలలో లయన్స్‌క్లబ్, న్యూ మోడరన్ ఐ క్లినిక్ కంప్యూటర్ పరీక్షా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థిదశలో చూపు ప్రధానమన్నారు. తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీనికి శిబిరాల ద్వారా లయన్స్ క్లబ్ తోడ్పాటునందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హెప్సిబా, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తోట సురేష్‌నాయుడు, కార్యదర్శి నవీన్ జయకుమార్, చంద్రశేఖర్, యరగుడిపాటి చలపతిరావు, మల్లు విజయకుమార్‌రెడ్డి, షేక్ రియాజ్‌అహ్మద్, పిఆర్వో కడివేటి చంద్రశేఖర్, ఏఇ శీనయ్య, ఎ.రమణయ్య, లయన్స్‌క్లబ్ సభ్యులు, గురుకులం ప్రధానోపాధ్యాయులు జి.సుజాతలు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మకు ముత్యాలచీర

చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ అమ్మవారికి శ్రీసిటీ ప్రతినిధి రవి సన్నారెడ్డి-మమత దంపతులు ఆదివారం ముత్యాలచీరను బహుకరించారు. ఈ చీర దాదాపు రూ.7లక్షల వరకు ఉంటుంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. చీరను ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏపిసి ఛైర్మెన్ యరటపల్లి జానకీరాంరెడ్డి, ఆలయ కమిటీ మాజీఛైర్మెన్లు రామమోహన్‌రెడ్డి, సింహాద్రి, మనోహర్, సభ్యుడు భీమిరెడ్డి మదన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు




గూడూరులోని విశ్వభారతి పాఠశాలలో ఇటీవల వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడాదినోత్సవ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు మంజులాదేవి మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆంగ్ల నిఘంటువులు, ప్యాడ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఐ.కమలాకర్, క్లబ్ ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, గురునాథం, ఎస్ఎల్ఎన్ స్వామి, వెంకటేశ్వరరావు, ఎస్ఎల్ఎన్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మూ'వీ'క్షణం

### ఓ ఇంటిదైంది...



ఇల్లు కట్టి చూడు... పెళ్లి చేసి చూడు అంటారు. వీటిలో హీరోయిన్ శృతిహాసన్ మొదటి ఘట్టాన్ని పూర్తిచేసింది. ముంబైలో అత్యంత ఖరీదైన ప్రాంతం అంధేరిలో శృతిహాసన్ కొత్త ఫ్లాట్ తీసుకుని దానిని ఆకర్షణీయంగా తీర్చి దిద్దుతుంది. ఈ ఫ్లాట్ ఇంటీరియర్ డిజైన్ పనులను స్వయంగా శృతే పర్యవేక్షిస్తుంది. ఇల్లైతే కొనింది... ఇక ఈ భామ పెళ్లి మాత్రమే మిగిలింది.

### ఈ బైక్ భలే ఖరీదు



పవన్ కల్యాణ్ మోడరన్ కృష్ణుడిగా నటిస్తున్న 'గోపాల గోపాల' సినిమాలో ఆయన ఇంట్రడక్షన్ బైక్ సన్నివేశంతో ఉంటుంది. ఇటీవలే ఈ సన్నివేశాలను మాదాపూర్ ఫ్లైఓవర్ మీద చిత్రీకరించారు. ఈ ఎంట్రీ సన్నివేశం కోసం పవన్ 6.6లక్షల రూపాయల ఖరీదు చేసే 'హ్యోసంగ్ జివి 650 అక్విలా ప్రో' బైక్ వాడారు.



### 'మనం' నిష్క్రమించాం

అక్కినేని వంశం అంతా కలసి తెరకెక్కించిన 'మనం' సినిమా మరియు అయోధ్యకుమార్ 'మిణుగురులు' చిత్రాలు మన దేశం నుండి ఆస్కార్‌కు నామినేట్ కాగా, ఇప్పుడు ఈ రెండు చిత్రాలు ఆస్కార్ నుండి వైదొలిగినట్లు తెలుస్తుంది.

# పేదలకు భూముల పంపిణీ



ఆర్డీవోతో చర్చిస్తున్న మాజీఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు

గూడూరు నియోజకవర్గంలో వున్న భూమిలేని నిరుపేదలకు భూములు పంపిణీ చేయాలని మాజీఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు కోరారు. గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నాడు ఆర్డీవో కె.శ్రీనివాసరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో భూమి లేని నిరుపేదలు ఉన్నారని గుర్తు చేశారు. వాకాడు మండలం అందలమాల గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా సిజెఎఫ్ఎస్ కింద భూములను మంజూరు చేశారని ఆయన దృష్టికి తెచ్చారు. సర్వేనెంబర్ 131లో ఉన్న 1.36ఎకరాల భూమికి పట్టాలు ఇవ్వాల్సిందిగా గ్రామస్థులు చాలాకాలంగా కోరుతున్నారని వివరించారు. భూమి లేనివారందరికీ డీకేటి పట్టాలు ఇవ్వాలని, చిల్లకూరు మండలంలోని వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల్లో భూస్వాములు అక్రమంగా రొయ్యలసాగు చేపట్టినా ఎలాంటి చర్యలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు కోడూరు శ్రీనివాసులురెడ్డి, మధురెడ్డి, కృష్ణమూర్తి, పి.రామచంద్రయ్య, శరత్‌కుమార్‌రెడ్డి, పత్రి జనార్ధన్, నరసరాజు, కృష్ణయ్య, రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

### మేషం


అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థికాభివృద్ధి పథకాలు కార్యరూపం దాల్చగలవు. వృత్తివ్యాపార వర్గాలకు అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ముఖ్య పత్రాలు, వస్తువులు, డబ్బు జాగ్రత్త పరచుకొనండి. అయినవాళ్ళ విభేదాలు సర్దుబాటు చేసుకొనడం మంచిది. నూతన పెట్టుబడులకు అనుకూల పరిస్థితులుంటాయి. ఉద్యోగయత్నం ఫలించగలదు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వ్యాపకాలను పెంచుకొంటూపోతారు. అందుచే పని భారం పెరిగి టెన్షన్ పడుతుంటారు. కొన్ని ముఖ్య విషయాలలో సర్దుబాటు ధోరణి ప్రదర్శించండి. చేస్తున్న విధి నిర్వహణలో పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తపడాలి. వృత్తి వ్యాపారాలలో కొద్దిపాటి అభివృద్ధి ఉండి, ఆదాయం పెరుగుతుంది. వృత్తిజీవనంలో ప్రాబల్యం సంపాదించుకొంటారు. ఆత్మీయుల నుండి మంచివార్తలు వింటారు.

### వృశ్చికం


విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

దూకుడుగా మాటల తీరు, నిర్ణయాల వల్ల ఇబ్బందులుపడతారు. వృత్తి ఉపాధి రంగాల వారికి ఆర్థికస్థితి బాగుంటుంది. వ్యాపారవర్గాలకు ఆశించిన ఆదాయము ఉండదు. బంధుమిత్రులతో పొరపొచ్చాలు రాకుండా జాగ్రత్త పడండి. అనుకున్న పనులను పట్టుదలగా పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు చిరు అవకాశాలు లభించగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 26.9.2014 నుండి
తేది. 02.10.2014 వరకు

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, కన్యలో రవి బుధ రాహువులు, తులలో బుధ శనులు, వృశ్చికంలో కుజుడు, తుల వృశ్చిక ధనుస్సులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

శుక్రమౌఢ్యమి జరుగుచున్నది. అన్నప్రాశన, నామకరణము తప్ప, ఏ ఇతర ముహూర్తములు లేవు.
తేది 1 బుధవారము సరస్వతీపూజ. తేది 2 గురువారము దుర్గాష్టమి మరియు మహర్నవమి. గాంధీ జయంతి. తేది 3 శుక్రవారము విజయదశమి.

**ఆశ్వయుజ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 26 | శుక్ర | విదియ | ప॥గం.1.07ని॥ |
| తేది. 27 | శని | తదియ | ప॥గం.1.32ని॥ |
| తేది. 28 | ఆది | చతుర్థి | ప॥గం.1.25ని॥ |
| తేది. 29 | సోమ | పంచమి | ప॥గం.12.50ని॥ |
| తేది. 30 | మంగళ | షష్ఠి | ప॥గం.11.47ని॥ |
| తేది. 01 | బుధ | సప్తమి | ఉ॥గం.10.20ని॥ |
| తేది. 02 | గురు | అష్టమి | ఉ॥గం.8.33ని॥ |

### వృషభం


కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

ఆదాయం సామాన్యం. అదనపు ఖర్చులుంటాయి. వృత్తివ్యాపారాలలో ఆదాయం ఉండినా సంతృప్తి ఉండదు. వర్గాలతో సమస్యలు రావచ్చును. వ్యవహారాలలో తొందరపడవద్దు. చేపట్టిన పనులు అనుకూలంగానే జరుగుతాయి. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్త పడండి. కొత్త కాంట్రాక్టులు, లీజులు లభ్యం కాగలవు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది.

### ధనుస్సు


మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబ విషయాలు, శుభకార్య విషయాలపై దృష్టి పెడతారు. వృత్తి ఉపాధి వ్యాపారరంగాల వారికి ఆదాయం పెరుగుతుంది. మీ ఆర్థికాభివృద్ధి కృషికి ప్రతిఫలం బాగుంటుంది. అవసరాలకు కొద్దిపాటి ఋణాలు చేస్తారు. నూతన వస్తువులు, గృహోపకరణాలు కొంటారు. అనుకోని ప్రయాణాలుంటాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, క్యాంపులుంటాయి.

### మిథునం


మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యాపారాలలో అభివృద్ధి, అనుభవం పొందుతారు. ఆదాయం బాగుంటుంది. వృత్తి ఉపాధి పథకాలలో రాబడి బాగుంటుంది. ముఖ్య అవసరాలకు ఋణాలు చేస్తారు. చేపట్టిన పనులు హడావిడిగా పూర్తి చేస్తారు. కోర్టు కేసులందు అనుకూలత, ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు లభించగలవు. షేర్లు, పెట్టుబడులపై ఆదాయముంటుంది. వివాదాలజోలికి పోవద్దు.

### మకరం


ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థికముగా బలపడతారు. వృత్తి వ్యాపార జీవనాలలో మంచి అవకాశాలు దొరకడం రాబడి పెరగడం ఉంటుంది. చెల్లింపులు సకాలంలో జరుగుతాయి. కొత్త పరికరాలు, యంత్రాలు, గృహోపకరణాలు కొంటారు. దూరం నుండి ఆహ్వానాలు అందుకొంటారు. పలుకుబడి డబ్బుతో పనులు జరిపించుకొంటారు. పెండింగ్ సమస్యలు పరిష్కారానికి రాగలవు.

### కర్కాటకం


పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి ఉపాధి పథకాలలో స్థిరపడతారు. ఆదాయం పెరుగుతుంది. వ్యాపార వర్గాల వారికి మంచి ఆర్థికావకాశాలు దొరుకుతాయి. ఆర్థిక సమస్యలు క్రమంగా సర్దుబాటు కాగలవు. స్థిరాస్తుల విక్రయాల విషయంలో తొందరపడవద్దు. పెట్టుబడులు, షేర్ల రంగాల వారికి లాభాలుంటాయి. ఉద్యోగులకు శుభవార్తలందుతాయి. ప్రముఖులను కలుసుకొనే అవకాశాలు రావచ్చును.

### కుంభం


ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి ఉపాధి పథకాలలో ఆదాయము బాగుండినా అసంతృప్తి ఉంటుంది. వ్యాపార అవకాశాలు సరిగా ఉండవు. ఉద్యోగులకు వ్యాపారులకు అధికారుల వల్ల ఇబ్బందులు, అనుమతులు ఆలస్యం కావడం జరుగుతుంది. పెండింగ్ పనులకు రాజమార్గంలో పరిష్కారం జరపాలి. వాణిజ్య ఒప్పందాలు, ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. అయినవాళ్ళు, మిత్రులు మీకు సహాయపడతారు.

### సింహం


మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

మీ పథకాలు ప్రణాళికలు సత్ఫలితాన్నివ్వగలవు. వ్యాపార రంగాలవారు పోటీలను సమర్థవంతంగా ఎదుర్కొంటారు. వృత్తి జీవనము కలవారికి ఆశా జనకంగా ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయంవైపు సాగుతాయి. విలువైన వస్తువులు, డబ్బు జాగ్రత్తగా కాపాడుకొనండి. ఆదాయవ్యయాలు సరిపోతూ సంతృప్తినిస్తాయి. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి.

### తుల


చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

నరాలు, కండరాల బాధల వంటి అనారోగ్య సమస్యలుంటాయి. వృత్తి ఉపాధి రంగాల వారికి రాబడి కొంత మెలుగా ఉంటుంది. హామీలు, రాయబారాలు మానడం మంచిది. ఆర్థిక ఒప్పందాలలో స్థిరాస్తుల విక్రయాలలో తొందర పడకండి. అనుకున్న పనులకు ఆటంకాల వల్ల నిదానంగా జరుగుతాయి. ఉద్యోగులు అధికారులతో చేరువ కాగలరు.

### మీనం


పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు అనుకూలంగా ఉంటుంది. వృత్తివ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. అయినా స్థితికి తగిన ఖర్చులుంటాయి. ముఖ్య అధికారి పనులందు అనుకూలత, ప్రభుత్వ అనుమతులు లభిస్తాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. దీర్ఘకాలిక అభివృద్ధికి గాను ఆలోచనలుంటాయి. షేర్లు, పెట్టుబడులపై లాభాలుంటాయి.

# సముద్రతీరంలో పరిశుభ్రతను పరిరక్షించుకోవాలి

*- జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్*


సముద్రతీరంలో చెత్తను ఏరుతున్న కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

సముద్ర తీరప్రాంతాల్లోనూ పరిశుభ్రతను పరిరక్షించుకునేందుకు, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు అందరూ కంకణ బద్ధులు కావాలని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ తీరప్రాంత గస్తీ దళం ఆధ్వర్యంలో ఈ నెల 20న అంతర్జాతీయ సముద్రతీర ప్రాంత పరిశుభ్రతా కార్యక్రమం జరిగింది. కృష్ణపట్నం సముద్రతీరం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ మన ఇంటి పరిసరాలను ఎలా శుభ్రంగా వుంచుకుంటామో అదేవిధంగా, సముద్రతీర ప్రాంతాలనూ పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. సముద్రతీర ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా నివారించుకోవాలని, ప్రజలకు తీరప్రాంతాల పరిశుభ్రత పట్ల అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు, అధికారులు, స్థానిక విద్యార్థులంతా కలసి తీరప్రాంతం వెంబడి తిరుగుతూ చెత్తను ఏరివేసి, పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చెన్నయ్య, కోస్ట్‌గార్డ్ కమాండెంట్ వేణుమాధవ్, అసిస్టెంట్ కమాండెంట్ ప్రదీప్, మెరైన్ సిఐ వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావుతో పాటు, ఎన్‌సిసి బృందం, ముత్తుకూరు జడ్పీహైస్కూల్, ఆర్ఆర్ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# దందాలు చేస్తే కఠిన చర్యలు

నెల్లూరు నగరంలోని డిఎస్పీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం రౌడీమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ వెంకటనాథ్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో దందాలు, రౌడీయిజం చేస్తే ఆస్తులు జప్తు చేసి కోర్టుకు పెడతామన్నారు. రౌడీషీట్లు ఉన్నవారు భూమి సెటిల్‌మెంట్లు ఇండ్లు ఖాళీ చేయించడం, దొంగతనాలు, హత్యల్లో పాల్గొనడం లాంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీట్లు ఉన్న వారు ప్రతి వారం పోలీసుస్టేషన్‌కు ఉదయం హాజరు కావాలన్నారు. సాయంత్రం డిఎస్పీ కార్యాలయానికి రావాలన్నారు. రౌడీషీటర్లు రౌడీ మేళాకు హాజరు కావాలన్నారు. రౌడీషీటరుగా ఉన్న వ్యక్తి ఎక్కడైనా డ్రైవర్‌గా ఉంటే ఆ సమాచారాన్ని పోలీసుస్టేషన్‌కు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర సీఐలు కెవి.రత్నం, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, రాజశేఖరరెడ్డి, బాబీజాన్‌సైదా, మంగారావు తదితరులు పాల్గొన్నారు.

**కాలధర్మం**

# టి.పి.భానురాజు



సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీకార్యదర్శి టి.పి.భానురాజు ఈ నెల 19వ తేదీన అనారోగ్యంతో మరణించారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరణం అనంతరం ఆయన మృతదేహాన్ని ఎన్టీఆర్ నగర్‌లోని స్వగృహంలో ఉంచగా, జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. గుంటూరు జిల్లా బాపట్ల మండలం నరసాయపాలెం స్వగ్రామం. కావలిలోని జవహర్ భారతిలో చదువుతూ ఎస్ఎఫ్ఐలో విద్యార్థి నాయకుడిగా కీలకపాత్ర పోషించారు. వ్యవసాయ, కార్మిక సంఘాలలోనూ చురుకుగా పనిచేశారు. ఐదుసార్లు నెల్లూరు లోక్‌సభ నుండి సీపీఎం అభ్యర్థిగా, 2009లో నెల్లూరురూరల్ నుండి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శిగా కూడా సేవలందించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# కాపర్ షీట్ల కోసం కాటేసారు

కోట్ల రూపాయలు విలువైన కాపర్‌షీట్ల కోసం తమిళనాడు డ్రైవర్లను హత్యచేసి నెల్లూరుజిల్లా గూడూరు పంబలేరు వాగులో పడేసిన మృతదేహాలను ఆదివారం పోలీసులు వెలికితీసారు. వివరాల్లోకి వెళితే... తమిళనాడు తూత్తుకూడిలోని సెరిలైగ్ కాపర్ కర్మాగారం నుంచి గుజరాత్‌లోని సిల్వాస్సా ప్రాంతానికి 56కాపర్ షీట్లతో లారీ బయలుదేరింది. తమిళనాడు సేలం సమీపంలోని నమక్కల్ జిల్లా కావకర్ పట్టి గ్రామానికి చెందిన శరవణన్, శ్రీకాంత్ మామా అల్లుళ్ళు. వీరు లారీడ్రైవర్లుగా ఉన్నారు. వీరి వెనుక చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన శ్రీరాములు, శివకుమార్ రోహన్, జనార్దన్, మురళీ, భరత్ మరొక లారీలో వెంబడించి, లారీని అడ్డంగాపెట్టి శరవణన్, శ్రీకాంత్‌లను కొట్టి తమ లారీలోకి ఎక్కించుకున్నారు. వారిరువురిని హత్య చేసి మృతదేహాలను గూడూరు పంబలేరు వాగులో పడేసారు.

***దొరికిన నిందితులు:*** నెల్లూరుజిల్లా దగదర్తి వద్ద పోలీసులు హైవే తనిఖీల్లో దాబా హోటల్ వద్ద ఉన్న రెండు లారీలను పట్టుకున్నారు. ముగ్గురు నిందితులు పరారు కాగా, శ్రీరాములు, శివకుమార్, రోహన్‌లు పోలీసులకు చిక్కారు. కృష్ణగిరి డిఎస్పీ పి.కె.రాజేంద్రన్, బుచ్చి సిఐ చంద్రమౌళి గూడూరు రూరల్ సిఐ మధుసూదనరావు, ఎస్ఐలు హనీఫ్, దశరథరామారావు ఆధ్వర్యంలో రెండు మృతదేహాలను వాగులోంచి స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# సోమశిలకు భారీగా వరదనీరు

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని సోమశిల జలాశయానికి భారీగా వరదనీరు వచ్చి చేరుతున్నాయి. ఈ నెల 20వ తేదీ నాటికి 25,345 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరిందని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం జలాశయంలో 30,450 టిఎంసిల నీరు నిల్వ వుందని, వరద ప్రవాహం ఇలాగే కొనసాగితే, 35 టిఎంసిల నీటిని నిల్వ చేసే అవకాశం వుందని వారు పేర్కొంటున్నారు.

## మాజీ సైనికుల పిల్లలకు ప్రధాని స్కాలర్‌షిప్ పథకం

ఇంజినీరింగ్, మెడికల్, యంబిఏ, యంసిఏ, బిడియస్ తదితర కోర్సుల్లో చేరిన మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువుల పిల్లలకు ప్రధానమంత్రి స్కాలర్‌షిప్ పథకం 2014-2015 సంవత్సరానికి మంజూరు చేస్తున్నట్లు నెల్లూరుజిల్లా సైనిక సంక్షేమాధికారి డా॥వి.కోటేశ్వరరావు తెలిపారు. ఆడ పిల్లలకు నెలకు రూ 2250/-లు మగ పిల్లలకు నెలకు రూ2000/-లు చొప్పున మంజూరు చేస్తారన్నారు. ఇంటర్‌లో 60 శాతం మార్కులు పొందిన వారు మాత్రమే ఈ స్కాలర్ షిప్‌కు అర్హులన్నారు. దరఖాస్తు ఫారాలను http/www.desw.gov.inలో డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసిన దరఖాస్తులను నవంబర్ నెల 20వ తేదీలోగా సమర్పించాలని కోరారు.

# మార్స్ కౌగిట్లోకి 'మామ్'

(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచమంతా ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. ఇస్రో శాస్త్రవేత్తలు గత ఏడాది నవంబరు 5వ తేదీన షార్ కేంద్రం నుంచి పిఎస్ఎల్వి సి-25 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి ప్రయోగించిన మామ్ ఉపగ్రహం అరుణగ్రహ కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశించింది. ఇస్రో శాస్త్రవేత్తల మేధాసంపత్తికి, అద్భుత విజయాలకీ ఇది మరో సంకేతమైంది. ప్రపంచదేశాల్లో సైతం ఇస్రో ఘనకీర్తి మారుమ్రోగింది. ఇస్రో శాస్త్రవేత్తల అపూర్వమైన కృషిని, వారు సాధించిన ఈ అద్భుతమైన విజయానికీ భారతప్రజలంతా ఆనందోత్సాహాలతో పులకించిపోయారు. ఈ విజయాన్ని ప్రయోగశాలల నుంచి వీక్షించిన షార్ శాస్త్రవేత్తలు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. అందులోనూ భారత్‌కు ఇది తొట్టతొలి గ్రహాంతర ఉపగ్రహ ప్రయోగం. అరుణగ్రహంపై పరిశోధనల లక్ష్యంగా ఈ సాహసోపేతమైన ప్రయోగం జరిగింది. దాదాపు 66.6 కోట్ల కిలోమీటర్ల దూరంలో అంతరిక్షంలో వున్న అరుణగ్రహ కక్ష్యలోకి... పది నెలల సుదీర్ఘ ప్రయాణం తర్వాత..మామ్ ఉపగ్రహం విజయవంతంగా చేరుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించడం... భారత్ చరిత్రలోనే ఒక అద్భుతమైన ఘట్టం.. చరిత్రాత్మక ఘట్టం కూడా.

అంతరిక్ష రంగంలో అనేక విజయాలు సాధించిన మన శాస్త్రవేత్తలు ఈ అద్భుత విజయంతో చరిత్రలో చిరస్మరణీయమైన స్థానాన్ని సాధించారు. తొలి ప్రయత్నంలోనే అరుణగ్రహాన్ని చేరుకోవడమన్నది ప్రపంచంలో ఇప్పటిదాకా ఏ దేశానికీ సాధ్యం కాలేదు..అనేక ప్రయోగాల తర్వాత పలు దేశాలు ఈ లక్ష్యాన్ని చేరుకున్నాయి. అయితే, భారత్ తొలి ప్రయత్నంలోనే ఈ మహత్తరమైన విజయం సాధించడం అంతరిక్ష రంగంలోనే చరిత్రాత్మక విశేషం. తొలి ప్రయోగంలోనే అంగారక కక్ష్యలోకి విజయవంతంగా దూసుకుపోయిన మామ్ ఉపగ్రహం ఆశించిన లక్ష్యాలకు అత్యంత చేరువలో వుంది. అంగారక గ్రహం, లేదా అరుణగ్రహంపై కోట్లాది సంవత్సరాల క్రితం జీవరాశి వుండేదన్న ఊహల్లో వాస్తవం వుందా లేదా అన్నది ఈ పరిశోధనలు నిగ్గు తేలుస్తాయి. అంగారక గ్రహంపై గతంలో జీవం వుండేదా?.నీటి జాడలేమైనా వున్నాయా?..జీవం ఆవిర్భావానికి ఆధారమైన మిథేన్ అంగారకునిపై వుందా?..గతంలో పరిశోధనల్లో పేర్కొన్నట్లు..ఈ అంగారక గ్రహంపై ఒకప్పుడు నీరు పుష్కలంగా వుండేదని, ఉష్ణ వాతావరణం వుండేదని తెలుస్తోంది. కానీ, అవన్నీ ఇప్పుడేమయ్యాయన్నది కూడా తాజా పరిశోధనలతో స్పష్టం కావాల్సివుంది. ఇలాంటి సందేహాలన్నిటి నిర్ధారణకు ఈ ప్రయోగాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

**ఇది ఘనవిజయం: ప్రధాని మోడీ అభినందనలు**



మామ్ ఉపగ్రహం అంగారక కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశించిన వెంటనే ఇస్రో శాస్త్రవేత్తలతోపాటు మామ్ గమనాన్ని వీక్షించిన ప్రధాని మోడీ ఇస్రో ఛైర్మెన్ రాధాకృష్ణన్‌ను ఆనందంతో గుండెలకు హత్తుకున్నారు.

బెంగుళూరులోని ఇస్రో కమాండెంట్ సెంటర్‌లో శాస్త్రవేత్తలతో కలసి ప్రధాని మోడీ ఈ ప్రయోగ విజయాన్ని వీక్షించారు. మంగళ్‌యాన్ ఘనవిజయంపై ప్రధాని ప్రశంసల వర్షం కురిపించారు. శాస్త్రవేత్తలందరినీ పేరుపేరునా అభినందించారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన విజయం ఎంతో గొప్పది. భారత అంతరిక్ష పరిశోధనలో అద్భుతవిజయం సాధించాం' అంటూ ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 'దాదాపుగా అసాధ్యమైన ఒక పనిని నేడు మనదేశం సుసాధ్యం చేసింది. అంతరిక్ష ప్రయోగంలో ఇప్పటి దాకా 51 ప్రయోగాలు జరిగాయి. వీటిలో 21 మాత్రమే విజయం సాధించాయి. అలాంటిది మనం మొట్టమొదటి ప్రయత్నంలోనే సాధించగలిగాం"..అని ప్రధాని ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. 'ఒక జాతిగా మనం ఏమిటనేది ఈ మహాద్భుత విజయం చాటిచెప్పింది..మనిషి సాహసం, పరిమితులను, మనిషి ఊహాశక్తి సరిహద్దులను ఈ విజయం అధిగమించింది'.. అంటూ ప్రధాని తన సందేశంలో హర్షం వ్యక్తం చేశారు. అంతేకాదు, 'అంతరిక్ష పరిశోధనల్లో మనదేశానికి గొప్పచరిత్ర వుంది. రోదసి రహస్యాలను అర్థం చేసుకోవడంలో మన ప్రాచీనులు ప్రపంచానికి తోడ్పడ్డారు. శూన్యం (సున్నా) అనే భావనను గుర్తించడం, భూమి తదితర గ్రహాల భ్రమణాన్ని , గ్రహణాల వివరాలను వెల్లడించడం వంటిదంతా మన ప్రాచీనులు అందించిన విజ్ఞానమే. ఇదే వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆధునిక భారత దేశం కూడా 'జగద్గురు భారత్'గా తన పాత్రను పోషించాలి..అంటూ ప్రధాని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. మొత్తంమీద 'మామ్' సాధించిన ఘన విజయంతో ప్రపంచమంతటా భారత్ పేరు మారుమోగిపోతోంది. శెభాష్... 'ఇస్రో'!



మొట్టమొదటి సారిగా 'మామ్' విడుదల చేసిన అంగరాక గ్రహం చిత్రం

# పేద విద్యార్థుల జీవితాలకు కొత్తవెలుగులిద్దాం



పేద విద్యార్థులను ఆదుకుందాం... వారి జీవితాలకు కొత్త వెలుగులు ఇద్దాం... ఆదర్శంగా నిలుద్దాం... మనసున్న వారంతా ఔదార్యంతో సహకరించండి అంటూ నెల్లూరుజిల్లాలోని పారిశ్రామికవేత్తలు, దాతలు, దేశవిదేశాల్లో ఉన్న ప్రవాసభారతీయులకు నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం విలేకర్లతో బొమ్మిరెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అత్యధిక మార్కులు రావాలని అందుకే జిల్లాలో దత్తత కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మొదటివిడతలో 55పాఠశాలలు, 89హాస్టళ్లను గుర్తించి దత్తత తీసుకుంటున్నామన్నారు. వీటి మరమ్మత్తులు అభివృద్ధి పనులకు గాను హాస్టళ్లకు రూ. 2.10కోట్లు, పాఠశాలలకు రూ. 1.35కోట్లు అవసరమని అధికారులు అంచనాలు తయారు చేశారన్నారు. ఉన్నతచదువులు చదివి మంచిస్థాయికి వెళ్లిన వారు దాతృత్వంతో ముందుకు వచ్చి ఒక్కొక్కరు రూ. 2లక్షలు విరాళాలు అందించాలని కోరారు. విరాళాలు అందించిన దాతల పేర్లను ఒక సంవత్సరం పాటు ఆయా సంస్థల వద్ద ఉంచుతామన్నారు.

**జీతం డబ్బుతో విద్యార్థులకు ప్రోత్సాహకాలు:** జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా ప్రభుత్వం ఇచ్చే గౌరవేతనం, ఇతర అలవెన్సులు కలిపి ఏడాదికి లక్ష రూపాయలకు మరో రూ. 1.50లక్షలు సొంతడబ్బును కలిపి పదవ తరగతిలో అత్యధికమార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తానని బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి అత్యధిక మార్కులు సాధించి మొదటి మూడుస్థానాల్లో నిలిచినవారిని గుర్తించి రూ. 5వేలు, రూ. 3వేలు, వెయ్యిరూపాయలు వంతున నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వికలాంగ విద్యార్థులకు కూడా బహుమతులు ఇస్తామన్నారు. నెల్లూరుజిల్లాలోని 10నియోజకవర్గాల నుంచి మొత్తం 30మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు, 20మంది వికలాంగ విద్యార్థులకు ఈ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ. 15వేలు, రూ. 10వేలు, రూ. 5వేలు వంతున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వికలాంగులకు రూ. 15వేలు, రూ. 10వేలు వంతున నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఇలా మొత్తం 55మంది విద్యార్థులకు ప్రతి సంవత్సరం బహుమతులు ఇవ్వడంతో పాటు ఇంటర్మీడియట్‌లో కార్పొరేట్ కళాశాలల్లో చేరేందుకు అవకాశం ఉంటే ఉచితంగా లేదా ఫీజురాయితీ ఇచ్చి విద్యను అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**కొసమెరుపు:** జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా ఐదేళ్లు ప్రభుత్వం కేటాయించే వాహనాన్ని వాడుకోనని, సొంత వాహనాన్ని వినియోగించుకుంటానని బొమ్మిరెడ్డి వెల్లడించారు.

# నెల్లూరుకు 'పవర్'లేదు

(మొదటిపేజీ తరువాయి)

చరిత్రలో చూడలేదు. కాని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఆ పెడధోరణి కనపతోతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంతజిల్లా చిత్తూరు అభివృద్ధికి ఏం చేసినా ఎవరూ తప్పుపట్టరు. గతంలో సీఎంగా పని చేసిన వారంతా కూడా సొంత జిల్లాలు, సొంత నియోజకవర్గాల అభివృద్ధిపై ఎంతోకొంత శ్రద్ధ కనపరచినవాళ్లే! అలాగని తమకు సీట్లు రాని జిల్లాలపై ద్వేషం పెంచుకోలేదు.

ఇప్పుడు చంద్రబాబు మాత్రం తనకు సీట్లు రాలేదని చెప్పి నెల్లూరుజిల్లాపై కసిపెంచుకున్నాడు. ఈ జిల్లా అభివృద్ధికి ఏ మాత్రం సహకరించడం లేదు. కేంద్రం మంజూరు చేసిన జాతీయ సంస్థలలో ఒక్క దానిని కూడా నెల్లూరుకు ఇవ్వలేదు. 'హీరో' కంపెనీ వాళ్లు తమ పరిశ్రమను నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు వద్ద పెడతామంటే దానిని చిత్తూరు జిల్లాకు తీసుకెళ్లాడు. కేంద్రం ప్రకటించిన స్మార్ట్ సిటీలలోనూ నెల్లూరుకు స్థానం లేకుండాపోయింది. ఇక జిల్లాకు సంబంధించిన మంత్రి పి.నారాయణ ఉంటే ఆయన అసలు నాకు నెల్లూరుతో సంబంధమే లేదన్నట్లుగా ఉన్నాడు. నెల్లూరుజిల్లా అభివృద్ధిపై ఆయన ఇంకా దృష్టిపెట్టలేదు. నా జిల్లాకు ఇది కావాలని ఆయన చంద్రబాబును గట్టిగా అడగలేక పోతున్నారు. మంత్రిగా ఆయనకు పవర్ వుందిగాని దానిని జిల్లా అభివృద్ధికి వినియోగించలేకపోతున్నారు. జిల్లాలో సీనియర్ నాయకులంతా ఓడిపోవడంతో వాళ్లకీ పవర్ లేకుండాపోయింది. కేంద్రం ప్రకటించిన స్మార్ట్‌సిటీల జాబితాలో నెల్లూరు పేరు లేదు. దీనినిబట్టి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుకు కూడా కేంద్రంలో పవర్ లేకుండా పోయిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అక్టోబర్ 2 గాంధీ జయంతి నుండి రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలలో 24గంటలు పవర్ అన్నారు. చివరకు చూస్తే దానిని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలకు మాత్రమే పరిమితం చేశారు. ఈ విధంగానూ నెల్లూరుకు పవర్ లేదు. మొత్తానికి నెల్లూరుజిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ఏ పనీ చేయదనేది తేటతెల్లమవుతుంది. ఈ జిల్లా అభివృద్ధికి స్థానికులే నడుంకట్టాలి. దేశవిదేశాల్లో ఉన్న నెల్లూరు పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు తమ జిల్లా అభివృద్ధికి సహకరించాలి.

# ఆపరేషన్ కరప్షన్

(మొదటిపేజీ తరువాయి)

ఏడాదిలోనో తొలగించడం భగవంతుడు వల్ల కూడా అయ్యే పని కాదు. కాని దేశంలో మితిమీరిన అవినీతి వల్ల ప్రజలు విసుగెత్తిపోయారు. ఈ అవినీతిని సమూలంగా రూపుమాపితేనే అభివృద్ధిలో నాలుగు అడుగులు వేయాల్సిన చోట పది అడుగులు వేయగలుగుతాం. అయితే ఈ అవినీతిని తన కార్యాలయం నుండే తుదముట్టించడానికి మోడీ శ్రీకారం చుట్టారు. అవినీతి అంతానికి మోడీ ఎంచుకున్న విధానం ప్రధాని స్థాయి నుండి క్రింది స్థాయి వరకు అంచెలంచెలుగా అవినీతిని నిర్మూలించుకుంటూ రావడం. ప్రధానమంత్రిగా మోడీ నిజాయితీని శంకించాల్సిన అవసరం లేదు. తనలాగే తన కేబినెట్ సహచరులు కూడా నీతిగా ఉండాలనేది మోడీ తాపత్రయం. తన మంత్రులెవరూ అవినీతి అక్రమాలకు పాల్పడకుండా మంత్రులపై తీవ్రస్థాయిలో నిఘా పెట్టినట్లుగా తెలుస్తుంది. ఏ నిముషంలో ఏ మంత్రి ఎక్కడ ఉన్నాడు. ఎవరితో సంప్రదింపులు జరుపుతున్నాడు, సదరు మంత్రి కుదుర్చుకునే ఒప్పందాలలో గాని, చేసే సంతకాలలోగాని స్వార్థ ప్రయోజనాలున్నాయా... అతను చేసే పనులు సొంతానికా, లేక ప్రజా సంక్షేమానికా... అనే విషయాలు వెంటనే మోడీకి చేరుతున్నాయి. ఏ మంత్రయినా రహస్యంగా ఎవరితోనన్నా చర్చలు జరుపుతున్నా, అవినీతి ఒప్పందాలు చేసుకుంటున్నా మరుక్షణంలో ప్రధాని మోడీ నుండి ఫోన్ వెళుతున్నట్లు తెలుస్తోంది. నువ్వు ఫలానా చోట ఉన్నావు, నువ్వు చేస్తున్న పని కరెక్ట్ కాదు, వెంటనే ఆ పని మానుకో అని మోడీ ఆదేశిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ మధ్య ఢిల్లీలోనే ఓ సంఘటన జరిగింది. ఓ కేంద్రమంత్రి కుమారుడు ఓ అధికారి బదిలీకి సంబంధించి పెద్ద మొత్తంలోనే లంచం తీసుకున్నాడు. ఇది మోడీకి తెలిసింది. వెంటనే ఆయన సదరు కేంద్రమంత్రిని, ఆయన కొడుకుని వీరికి లంచం ఇచ్చిన అధికారిని పిలిపించుకున్నాడు. ఎంత లంచం ఇచ్చింది ఆ అధికారి చేతే చెప్పించాడు. లంచంగా తీసుకున్న సొమ్మును సదరు కేంద్రమంత్రి కొడుకు చేత వాపసు చేయించి ఇలాంటి పనులు ఇక చేయవద్దని మందలించి పంపినట్లు సమాచారం. ఈ సంఘటన జరిగాక కేంద్ర మంత్రులందరు ఒళ్లు దగ్గరపెట్టుకుని పనిచేస్తున్నారు. మోడీ కేబినెట్‌లో చాలావరకు మంచివ్యక్తులే మంత్రులుగా వున్నారు. ఎవరికన్నా అవినీతి అవలక్షణాలు ఉంటే మోడీ చర్యలతో వాళ్లు దారికి రావడం ఖాయం. దేశానికి పట్టిన అవినీతి మలినాన్ని తొలగించాలనే మోడీ ప్రయత్నం హర్షించతగినదే! ఆయన ఆలోచనలను అందరూ అనుసరిస్తే అవినీతి అంతానికి తొలిఅడుగు పడ్డట్లే!

శ్రీను గల్పిక

# చైనా అధ్యక్షుడికి నెల్లూరు స్పెషల్ వంటకం

అది గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమానాశ్రయం. భారత ప్రధాని నరేంద్ర మోడీ, విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడులు అక్కడ చేతుల్లో పూలబొకేలు పట్టుకుని ఎదురుచూస్తున్నారు. అంతలో బీజింగ్ నుండి వచ్చిన ఒక విమానం ల్యాండయ్యింది. అందులో నుండి చైనా అధ్యక్షుడు జీజిన్‌పింగ్, ఆయన సతీమణి, సిబ్బంది దిగారు. మోడీ బృందం వారికి ఘనంగా స్వాగతం పలికింది. తర్వాత అందరూ నర్మదానది తీరాన గల సబర్మతి ఆశ్రమానికి వెళ్లారు. జీజిన్‌పింగ్‌కు అక్కడ మోడీ విందు ఏర్పాటు చేశారు. అక్కడ అన్నీ గుజరాత్ వంటకాలే! రోటీలు, చపాతీలు, దాల్, స్వీట్స్ ఇలాంటివే... జీజిన్‌పింగ్ వాటిని చాలా అయిష్టంగా తినసాగాడు. ఆయన ఆ ఫుడ్ తింటున్నంత సేపు పక్కనే నదీజలాల్లో ఎగురుతున్న కప్పలను, పాకుతున్న పాములను చూసి గుటకలు వేయసాగాడు. దానిని మోడీ గమనించాడు. అయిష్టంగానే జీజిన్‌పింగ్ విందు ముగిసింది. అప్పుడు మోడీ ఆయనతో మాటలు కలిపాడు. సరిహద్దులో మీ సైన్యం చొరబాట్లు ఎక్కువుగా ఉంటున్నాయి. ముందు వాటిని ఆపండని మోడీ కోరాడు. దానికి జీజిన్‌పింగ్... అమెరికా సైన్యానికంటే ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్, సిరియా వంటి దేశాలలో పని వచ్చింది. మా సైనికులు చాలా ఏళ్లుగా పనిలేకుండా ఖాళీగా వున్నారు. సరిహద్దుల్లో ఏదో ఒకటి చేస్తుంటేనేగా వాళ్లకు ప్రాక్టీసు ఉండేది, ఖాళీగా ఉంటే తుపాకులు తుప్పుపడతాయి కదా అని అన్నాడు. తర్వాత మోడీ... మన రెండు దేశాల మధ్య రక్షణ, ఆర్థిక రంగాలలో పరస్పర సహకారం ఉండాలని కోరాడు. అందుకు పింగ్... ఇప్పటి దాకా ఉన్నామా... అయినా ఎవరి బ్రతుకు వాళ్లు బ్రతకడం లేదా.. ఆ సంగతి తర్వాత చూద్దాంలే అని అన్నాడు. ఆ మాటలతో మోడీకి కాలింది. అసలు వీడు ఇండియాకు ఎందుకొచ్చినట్లు... అయినా నేను జపాన్‌లో అన్న మాటలను ఇతను మనసులో పెట్టుకున్నట్లున్నాడు. అందుకే ఇంత ముభావంగా మాట్లాడుతున్నాడనుకుని, సారీ సార్, నేను జపాన్‌లో కొన్ని రాజ్యాలు విస్తరణ వాదాన్ని అనుసరిస్తున్నాయని చేసిన వ్యాఖ్యలు మిమ్మల్ని ఉద్దేశించినవి కాదు అని చెప్పాడు. నేనేమీ ఆ మాటలను మనసులో పెట్టుకోలేదని జీజిన్‌పింగ్ అన్నాడు. అప్పుడు అరుణ్‌జైట్లీ మోడీ చెవిలో... అతనికి మీరు పెట్టిన ఆహారం నచ్చినట్లు లేదు, ఇండియాలో వంటలు బాగుంటాయనే ప్రచారం వుంది కదా, ఇక్కడ చూస్తే మీరు అతనికి చప్పిడి తిండి పెట్టారు. వారికి ఇష్టమైనవి మన ఇండియన్ స్టైల్‌లో చేసిపెడితే సరి అని చెప్పాడు. అలాగయితే రేపు ఢిల్లీలో మన సత్తాఏంటో చూపిద్దాం అని మోడీ చెప్పాడు.

★★★★★

రెండోరోజు జీజిన్‌పింగ్ పర్యటన ఢిల్లీలో జరగసాగింది. భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీని, మాజీప్రధాని మన్మోహన్‌సింగ్‌ను, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని, యువరాజు రాహుల్‌గాంధీని ఆయన కలుసుకున్నారు. రాత్రి అందరూ విందుకు హాజరయ్యారు. మనవాళ్లు మాత్రం చపాతీలు, పుల్కాలు తినసాగారు. జీజిన్‌పింగ్‌కు ఆయన బృందానికి మాత్రం పాములపులుసు, కప్పల ఫ్రై, బాతుమాంసం బిరియాని, బొద్దింకల వేపుడు, ఎంట్రకాయల కుర్మా, వానపాముల న్యూడిల్స్ వంటి వంటకాలు చేసిపెట్టారు. ఈ వంటకాలు తింటే జీజిన్‌పింగ్ ఫ్లాటైపోతాడు, మనతో అన్నిరకాల ఒప్పందాలకు వచ్చేస్తాడని మోడీ మనసులో అనుకోసాగాడు. ఆయన ప్లేట్‌లో ఆ వంటకాలన్నీ వడ్డించుకున్నాడు. వాటి టేస్ట్ చూసి పింగ్ ముఖం చిట్లించ సాగాడు. ఆ వంటకాలలో ఏ ఒక్కటీ ఆయనకు నచ్చలేదు. ఆరోజు కూడా ఆయనకు భోజనం విషయంలో అసంతృప్తి మిగిలింది. దాంతో మోడీతో ఇరుదేశాల ప్రయోజనాలకు సంబంధించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ రెండురోజుల వంటకాలు జీజిన్‌పింగ్‌కు నచ్చలేదన్న విషయాన్ని వెంకయ్యనాయుడు పసిగట్టాడు. అతని నోటికి మంచి టేస్ట్ తగిలితేనే అతను వచ్చినదానికి మన దేశానికి ఫలితం ఉంటుందనుకున్నాడు. వెంటనే అక్కడ నుండే స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానంద రెడ్డికి ఫోన్ చేశాడు. వివేకా ఫోన్ ఎత్తాడు. అవతల నుండి వెంకయ్య మాట్లాడుతూ... వివేకా, నువ్వేం చేస్తావో, ఎవరి చేత చేయిస్తావో నాకు తెలియదు, రేపు మధ్యాహ్నానికల్లా మన నెల్లూరు చేపల పులుసు ఓ పదికిలోలు ఢిల్లీకి రావాలి, ఓ విదేశీ అతిథిని మన చేపలపులుసుతోనే దారికి తేవాలన్నాడు. ఆ మాటకు వివేకా... ఎవరన్నా ఆ అతిథి అని అడిగాడు. చైనా అధ్యక్షుడు జీజిన్‌పింగ్ అని వెంకయ్య చెప్పాడు. ఆ మాటకు వివేకా... చైనా వాళ్లకు చేపల పులుసు అంటే పులికి పచ్చగడ్డి పెట్టడమే కదన్నా, వాళ్లకు చేపలపులుసు కాదు, ఓ వెరైటీ డిష్‌ను నేను తయారు చేసి పంపిస్తా కదా, మీరేం వర్రీ కావద్దని చెప్పి పెట్టేసాడు.

★★★★★

మూడోరోజు చైనా, భారత్ విదేశాంగ కార్యదర్శులు, రాయబారుల మధ్య చర్చలు జరిగాయి. ఈలోపు ఢిల్లీలో జీజిన్‌పింగ్ దంపతులు బాపుఘాట్‌ను, తాజ్‌మహల్‌ను, ఎర్రకోటను సందర్శించి మధ్యాహ్నానికి భోజనానికి ప్రధాని కార్యాలయానికి చేరుకున్నారు. అప్పుడే నెల్లూరు నుండి ఒక వాహనంలో రేణిగుంటకు తెచ్చి అక్కడ నుండి స్పెషల్ విమానంలో ఢిల్లీకి తీసుకొచ్చిన స్పెషల్ వంటకాన్ని అక్కడికి తెచ్చారు. పెద్దకుండలో ఆ వంటకం వుంది. గట్టిగా ప్యాక్‌చేసి వున్నారు. వెంకయ్య ఆ కుండకున్న ప్యాకింగ్‌ను తీసేశాడు. అంతే ఆ కుండలో నుండి మసాలా వాసన భోపాల్ విషవాయువు మాదిరిగా విస్తరిం చింది. ఆ వాసనకు అందరినోర్లు ఊరసాగాయి. జీజిన్‌పింగ్ అయితే ఆ వాసనకు ఆగలేక ఒక ప్లేటు తీసుకుని ఆ కుండ వద్దకు పరుగెత్తాడు. వెంకయ్య ఆయన ప్లేటులో ఆ కుండలో వున్న పులుసును వడ్డించాడు. జీజిన్‌పింగ్ ఆ పులుసును అన్నంలో కలుపుకుని మహా ఇష్టంగా తింటున్నాడు. ఆ వంటకానికి అతను పడిపోయాడు. ఆ మసాలా వాసనకు వెంకయ్య కూడా ఆగలేక, వెంటనే ప్లేటులో అన్నం, పులుసు పోసుకుని నాలుగు ముద్దలు లాగించాడు. జీజిన్‌పింగ్ మాత్రం ఆరుసార్లు ఆ పులుసును వడ్డించుకుని లొట్టలేసుకుంటూ తిన్నాడు. ఇంతమంచి రుచికరమైన తిండి తిన్నాక అతనిలో కొంత హుషారొచ్చింది. వెంటనే మోడీతో కూర్చుని చాలా సంతోషంగా మాట్లాడాడు. మాతో సరిహద్దుల్లో ఏ సమస్యారాదని హామీ ఇచ్చాడు. అంతేకాదు కొన్ని వేలకోట్ల రూపాయల మేర భారత్‌తో వ్యాపార ఒప్పందాలకు సంతకం చేశాడు. జీజిన్‌పింగ్‌లో ఒక్కసారిగా వచ్చిన మార్పుకు నెల్లూరు నుండి వచ్చిన స్పెషల్ డిష్ కారణమని మోడీ గ్రహించాడు. వెంటనే వెంకయ్య వద్దకు వచ్చి, థ్యాంక్యు వెంకయ్యాజీ, సరైన సమయానికి నెల్లూరు నుండి మంచి వంటకం తెప్పించారు. దానివల్లే చైనా అధ్యక్షుడిని దారిలోకి తేగలిగామన్నాడు. అందుకు వెంకయ్య... ఈ థ్యాంక్యు నాకు కాదు, మా వివేకాకు చెప్పాలంటూ ఆయనకు ఫోన్ చేశాడు. వివేకా ఫోన్ ఎత్తాడు. థ్యాంక్యు వివేకా, నువ్వు పంపించిన వంటకం ఇక్కడ బాగా పనిచేసింది. అది ఏం వంటకం అని వెంకయ్య అడిగాడు. దానికి వివేకా... దోమల పులుసన్నా... మన నెల్లూరు నిండా ముదురుదోమలున్నాయి కదా, ఓ పదికిలోలు పట్టించి పులుసు పెట్టి పంపించా... చైనావాళ్లకు అటువంటి వంటలే ఇష్టమన్నాడు. ఆ మాట వినడంతోటే వెంకయ్య వాష్‌బేసిన్ వద్దకు పరుగుపెట్టాడు. మూడురోజుల క్రితం తిన్నది కూడా కక్కేసాడు.

కదంబం

## గ్రీష్మం

ఆశారాజు
హైదరాబాద్. 9392302245

మండుతున్న ఎండలో
        ఉండడానికి నీడలేదు
అర్థరాత్రి దాహం వేస్తే
        గొంతు తడిపే తోడు లేదు
అలసిపోయి కూలబడితే
        పట్టిలేపే ఆసరా లేదు
దారిలేని ఎడారిలో
        చేరడానికి గమ్యం లేదు
ఎటు తిరిగి కేకేసినా
        బదులు పలికే ప్రేమ లేదు
బహుశా!
ఇపుడు గ్రీష్మం అనుకొంటాను


# కళలను పరిరక్షించుకోవాలి

**మాజీ ఎమ్మెల్యే ముంగమూరు**

మన కళలను, సంగీతాన్ని, సంప్రదాయలను పరిరక్షించుకోవాలని మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన ప్రముఖ సంగీతవేత్త ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతోత్సవం ముగింపు సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. చిన్నారులు గురువుల సహకారంతో చిన్నతనం నుంచే కళలను సాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు చాట్ల నరసింహారావు మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గడించిన ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతోత్సవాలను నెల్లూరులో మూడురోజుల పాటు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ సంగీత నృత్యపాఠశాల ప్రిన్సిపాల్ మునికుమార్ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి, తద్వారా మరింతమంది కళాకారులను ప్రోత్సహిస్తుండడం ప్రశంసనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన ప్రముఖ గాత్రవిద్వాంసులు ఎం. కృష్ణమోహన్‌కు డాక్టర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి పురస్కారాన్ని ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ మునికుమార్ ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎం. కృష్ణమోహన్ గాత్రకచేరీ అందరినీ అలరించింది. తొలుత, పివిఎల్ కార్తీక్ సుందర్ భరద్వాజ్ గాత్రకచేరీ వీనులవిందుగా సాగింది. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రముఖులు బివి నరసింహం, నలుబోలు బలరామయ్యనాయుడు, ఇవిఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రాచపాళెం రఘుకు అభ్యుదయ కవితా పురస్కారం



నెల్లూరుజిల్లాకు చెందిన ప్రముఖ కవి, సాహితీరంగంలో విశేష కృషి చేస్తున్న రాచపాళెం రఘుకు ఇటీవల కృష్ణాజిల్లా మచిలీపట్నంలో అభ్యుదయ కవితా పురస్కారం అందజేశారు. భావతరంగిణి సాంస్కృతిక సమాచార మాసపత్రిక 16 వ వార్షికోత్సవ వేడుకల్లో రఘుకు ఈ విశిష్టమైన పురస్కారం అందజేశారు. రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా రఘు ఈ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, కొత్తగూడెం క్లబ్ కార్యదర్శి డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, భావతరంగిణి పత్రిక సంపాదకులు భవిష్య, నెల్లూరు కవి కె.మురళీ మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కె.వి నాగేశ్వరరావుకు

# మానస సాహిత్య అవార్డు




విజయవాడ మానస సాహిత్య సాంస్కృతిక సంస్థవారు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో నెల్లూరుజిల్లా కు చెందిన కవి, రచయిత, నటుడు కె.వి నాగేశ్వరరావుకు ఉత్తమ కవితాపురస్కారంతో పాటు, ప్రజాకవి బిరుదు లభించింది. ఆయన రచించిన 'ఛీ!..ఏం మనిషి?!'..కవితకు ఉత్తమ కవితా పురస్కారం అందజేసి 'ప్రజాకవి' బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈ నెల 21న విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా చేతుల మీదుగా కె.వి నాగేశ్వరరావు ఈ పురస్కారాన్ని, యోగ్యతాపత్రాన్ని, జ్ఞాపికను అందుకున్నారు. సినీ దర్శకుడు డా.సుందరరావు, కవయిత్రి మందరపు హైమావతి, సినీ హాస్యనటుడు రామతీర్థ, సంస్థ వ్యవస్థాపకులు బ్రహ్మానందరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, కె.వి.నాగేశ్వరరావు ఇప్పటికే వివిధ సాహితీసంస్థల నుంచి 12 జాతీయ కవితా అవార్డులు అందుకునివున్నారు. ఈ ఏడాది వరుసగా మరో 5 ఉత్తమ కవితా అవార్డులు అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా జిల్లాలోని కవులు, రచయితలు నాగేశ్వరరావుకు తమ అభినందనలు తెలిపారు.



## ఆనందోత్సాహాల మధ్య

# విశాఖ మెగాలీడర్ టిఎస్సార్ జన్మదినోత్సవం

- పద్మభూషణ్ జేసుదాసు గోల్డెన్ జూబ్లీ వేడుకలో పాల్గొన్న మెగా హీరో చిరంజీవి, కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు
- పలువురు పీఠాధిపతులు వివిధ పార్టీల రాజకీయ నాయకులు ఎందరో సినీ తారలతో సందడిగా వేడుకలు

రాజ్యసభ సభ్యులు, కళా బంధు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి గారి జన్మదినోత్సవం సందర్భంగా పద్మభూషణ్ శ్రీ జేసుదాసు గోల్డెన్ జూబ్లీ వేడుకలు సర్వధర్మ సమ భావన సమ్మేళనం సెప్టెంబర్ 16,17 తేదీల్లో విశాఖలో అతి వైభవంగా జరిగాయి. గత 40 సంవత్సరాలుగా జరుగుతున్న ఈ వేడుకలకు ప్రముఖ సినీతారలతో పాటు కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి తదితర రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు ఒకే వేదిక పై పాల్గొనడం విశేషం. అపూర్వం, అద్భుతం, అనంతం, అహ్లాదం అఖిలం, అమోఘం, అమేఖలం.. ఇలా తెలుగు భాషలోని అంత్య ప్రాస పదాలతోను.. అంతరంగ వైభవం అనితర సాధ్యం.. అంబరాన్నంటిన సంబరం.. కనివిని ఎరుగని విధంగా జరిగింది కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి జన్మదిన సంరంభం. ప్రపంచంలో ఏ వ్యక్తికి అయినా ఇలాంటి రీతిలో జన్మదిన వేడుకలు జరుగుతాయా అన్న సందేహం వీక్షించిన ప్రేక్షకుల అందరిలో కలిగిన విధంగా సాగాయి టిఎస్సార్ జన్మదిన దినోత్సవ వేడుకలు. కలలో కూడా సాధ్యం కాని సంగీత సాహిత్య కళా రాజకీయ లబ్ధప్రతిష్టుల అపూర్వ సమ్మేళనంతో నిండిపోయిన వేదిక ఇది. ఎందరెందరో విశిష్ట మహానుభావులతో మహా విశాఖలో పోర్టు కళావాణి మండపం కళాభారతి మండపం కళకళలాడిపోయాయి. విశాఖ ప్రజావాహిని వారిని దర్శించి మురిసిపోయింది. ఒక వ్యక్తి జన్మదిన వేడుక ఇంత అంగరంగ వైభవంగా అంబరాన్నంటే విధంగా సంబరంగా ఒక సంరంభంగా నిర్వహించడం బహుఅరుదు. ఈ అదృష్టం ఒక్క సుబ్బరామిరెడ్డికే సొంతం. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి ఆధ్వర్యంలో పుష్పగిరి పీఠాధిపతి, శ్రీధర్ స్వామితో పాటు దేశ వ్యాప్తంగా ఇరవై ప్రధాన దేవాలయాల ప్రధాన అర్చకులు విచ్చేసి టిఎస్సార్‌తో పాటు విశాఖ ప్రజలకు దర్శనమిచ్చి అనుగ్రహ భాషణం చేశారు. నిజ జీవితంలో చిటపటలాడుకునే రాజకీయ పార్టీల నేతలు టిఎస్సార్ జన్మదిన వేడుక వేదికపై పాలు నీళ్లులా కలసిపోయారు. రాజకీయ వైరుధ్యాలు పక్కన పెట్టి సరదాగా గడిపారు. మెగాస్టార్ చిరంజీవి, కలెక్షన్‌కింగ్ మోహన్ బాబు ఇద్దరూ అత్యంత ఉత్సాహంగా జేసుదాసు, సుబ్బరామిరెడ్డిని ఘనంగా సత్కరించి ప్రేక్షకులకు కనువిందు చేశారు, విశాఖలో సెప్టెంబర్ 16,17 తేదీల్లో జరిగిన టిఎస్సార్ జన్మదిన వేడుకలు ముందుగా వచ్చిన దసరా పండుగ అంత వైభవంగా జరిగాయి. అదే విధంగా ప్రతి ఏడాదిలాగే సుబ్బరామిరెడ్డి వికలాంగులకు, పేదలకు వస్త్రదానం చేశారు. సుబ్బరామిరెడ్డి శివస్తోత్రం చేసేటప్పుడు వేదిక మీద శివలింగోద్భవం కళ్లు చెదిరిపోయేలా సృష్టించిన ఈవెంట్ రాజును పలువురు ప్రశంసించారు.









# బాలల దినోత్సవ కానుక... లాయర్

## చిన్నారుల విజయ దీపిక





*'పుత్రోత్సాహము తండ్రికి*
*పుత్రుడు జన్మించినపుడె పుట్టదు జనులా*
*పుత్రుని కనుగొని పొగడగ*
*పుత్రోత్సాహంబు నాడు పొందును సుమతీ'*

... అన్నట్లుగా బిడ్డ జన్మించినప్పటికంటే, ఆ బిడ్డ ప్రతిభతో రాణించి అందరి ప్రశంసలందుకున్నప్పుడు ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులే వుండవు. కంటి పాపల్లాంటి మీ ఇంటి పాపాయిలు సాధించిన ఘనతలను, సాధిస్తున్న ఘన విజయాలను సమాజానికి తెలియజేసి వారికి సముచితమైన గౌరవాన్ని, మరింత ప్రోత్సాహాన్ని అందించాలని సంకల్పించింది మా(మీ) లాయర్.మన జిల్లాలో బాల మేధావులు, బాల కళాకారులు ఎందరో వున్నారు. అదేవిధంగా, క్రీడా రంగంలోనూ, వివిధ కళారూపాల ప్రదర్శనల్లోనూ, మేటిగా.. ధీటుగా వున్నవారూ.. అత్యద్భుతమైన మేధస్సుతో పిల్లలు కాదు.. పిడుగులన్నట్లుగా రాణిస్తున్నవారూ ఎందరో వున్నారు. నాట్యంలోనూ, గానంలోనూ, సంగీతంలోనూ.. చిత్రలేఖనంలోనూ... ఇలా ఎన్నో రంగాల్లో తమ ప్రతిభా పాటవాలను చాటుకుంటూ సింహపురి కీర్తిబావుటాను రెపరెపలాడిస్తున్న చిన్నారులు అనేకమంది వున్నారు. అలాంటివారి ప్రతిభకు దర్పణంగా.. చిన్నారులందరికీ తీపి జ్ఞాపికగా వుండేలా ఒక ప్రత్యేక అనుబంధాన్ని.. రంగుల గ్రంథంగా అందించేందుకు లాయర్ వారపత్రిక సంసిద్ధమైంది. ఈ బాలల దినోత్సవం (నవంబరు14, 2014) నాడు సింహపురి చిన్నారిలోకానికి చిరుకానుకగా... అందరూ పది కాలాల పాటు పదిలపరచుకునే విధంగా.. సర్వాంగసుందరంగా.. లాయర్ 'చిన్నారుల విజయదీపిక'ను రూపొందిస్తోంది. అందుకు మీ అందరి సహకారాన్ని కోరుతున్నాం.. మీ చల్లని దీవెనలను ఆకాంక్షిస్తున్నాం. 'రేపటి తరం' ప్రతిభా విశేషాలను నేటితరం వారికి తెలియజెప్పడానికి లాయర్ చేస్తున్న ఈ బృహత్తర కృషిలో మీ అందరూ భాగస్వాములు కావాలని మనసారా కోరుతున్నాం. ఆయా రంగాల్లో మీ చిన్నారులు చేస్తున్న కృషిని, వారు సాధించిన బహుమతులు, పొందిన బిరుదులూ, ప్రశంసలూ వగైరా వివరాలన్నిటినీ వీలైనంత క్లుప్తంగా, బాగా అర్థమయ్యేలా రాసి, చిన్నారుల ప్రతిభా వివరాలతో పాటు సంబంధిత ఫోటోలను జతచేసి, మీ చిన్నారి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను, మీ చిరునామా, ఫోన్ నంబరుతో పాటు, మీ చిన్నారి చదువుకుంటున్న పాఠశాల పేరు, ఆయా రంగాల్లో ప్రోత్సాహం అందిస్తున్న గురువుల పేర్లు కూడా జతపరచి మాకు పంపవలసిందిగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకూ, ఆయా పాఠశాలల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేస్తున్నాం. వీలైనంత ఎక్కువమంది చిన్నారులకు వేదికగా వుండేందుకు, వీలైనంత సంక్షిప్తంగా ఆ వివరాలను పంపగలరని కోరుతున్నాం. ఎల్‌కెజి నుంచి 10వ తరగతి దాకా చదువుకునే మీ చిన్నారుల ప్రతిభా విశేషాలను మాత్రమే మాకు తెలియజేయండి.

**అక్టోబర్ 15వ తేదీలోగా ఆ వివరాలు మాకు చేరేలా రాసి పంపగలరని కోరుతున్నాం!..**

చిరునామా: లాయర్ వార పత్రిక, ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే అవుట్, నెల్లూరు - 524 003. ఫోన్: 0861 - 2323485. సెల్: 98663 14741.


Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com